





# నేడు మదురైలో డీఎంకే సర్వసభ్య మండలి



అన్నా అరివాలయాన్ని తలపించేలా ఉన్న మహానాడు ప్రవేశద్వారం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఎంకే కోశాధికారి, ఎంపీ టీఆర్‌బాలు, మంత్రి మూర్తి తదితరులు

## ● అసెంబ్లీ ఎన్నికల దిశగా కీలక నిర్ణయాలు

చెన్నై, మే 31 (ఆంధ్రజ్యోతి): వచ్చే యేడాది జరగనున్న రాష్ట్ర శాసనసభ ఎన్నికల సన్నాహాలపై వ్యూహరచనకు అనువుగా డీఎంకే సర్వసభ్య మండలి సమావేశం ఆదివారం మదురై నగరంలో జరగనుంది. శాసనసభ ఎన్నికల్లో డీఎంకే కూటమి ఈ సారి తప్పకుండా 200 సీట్లు గెలుచుకోవాలని, ఆ దిశగా పార్టీ శ్రేణులు కృషి చేయాలని ఇప్పటికే పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పలుమార్లు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. ఆ లక్ష్య సాధన కోసమే మదురైలో సర్వసభ్యమండలి సమావేశం జరగనుందని శుక్రవారం పార్టీ శ్రేణులకు స్టాలిన్ రాసిన లేఖలో పేర్కొన్నారు. శాసనసభ ఎన్నికలకు ఆయన నియోజకవర్గాలవారీగా ఇన్‌చార్జీలను నియమించారు. జిల్లాలను జోన్ల వారీగా విభజించి జోనల్ ఇన్‌ఛార్జీలను కూడా నియమించారు. ఈ నెల 3న చెన్నైలో జరిగిన జిల్లా నేతల సమావేశంలో జూన్ 1న మదురై నగరంలో పార్టీ సర్వసభ్య మండలి సమావేశం జరుగుతుందని స్టాలిన్ ప్రకటించారు. ఆ మేరకు మదురై ఉత్తంగుడిలో ఉన్న కలైంజర్ దిడల్ (మైదానం)లో సర్వసభ్యమండలి సమావేశం జరగనుంది. ఈ నేపథ్యంలోనే సర్వసభ్య మండలి సమావేశంలో పాల్గొనే నిమిత్తం శనివారం ఉదయం నగరం నుంచి విమానంలో బయలుదేరి, మదురై విమానాశ్రయం చేరుకున్న స్టాలిన్‌కు పార్టీ శ్రేణులు ఘనస్వాగతం పలికాయి. పార్టీ ప్రముఖులు, జిల్లా శాఖ నేతలు, మంత్రులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. ఆ సందర్భంగా విమానాశ్రయం వద్ద గుమికూడిన స్థానిక ప్రజలతో కరచాలనం చేశారు. బాలబాలికల వద్దకు వెళ్లి బాగా చదవాలని చెప్పారు. సుమారు పావుగంటకు పైగా స్థానికుల స్వాగత సత్కారాలు అందుకున్న స్టాలిన్ ప్రభుత్వ అతిథిగృహంలో సాయంత్రం నాలుగు గంటలకు దాకా విశ్రాంతి తీసుకున్నారు.

### 25 కిలోమీటర్ల రోడ్‌షో...



రోడ్ షో సందర్భంగా స్థానికులతో కరచాలనం చేస్తున్న స్టాలిన్

శనివారం సాయంత్రం 4 గంటలకు స్టాలిన్ రోడ్‌షో నిర్వహించారు. మదురై అవనియాపురం మరుదుపాండ్య సోదరుల విగ్రహ కూడలి ప్రాంతం నుంచి ఈ రోడ్‌షో ప్రారంభమైంది. విల్లాపురం, జయవిలాస్ వంతెన కూడలి, జైహింద్ పురం, జీవా నగర్, సుందరరాజపురం మార్కెట్, టీవీఎస్ నగర్ కొత్త ఫ్లైఓవర్, పళంగానత్తం, వావుసి ఫ్లైఓవర్, బైపాస్ యరోడ్డు, పొన్‌మేని జంక్షన్, కాళవాసల్, గురుథియేటర్ జంక్షన్, ఆరప్పాళయం బస్‌స్టేషన్, జల్లికట్టు రౌండ్ ఠాణా, తిరుమల నాయకర్ విగ్రహ ప్రాంతం, కొత్త జైలు రోడ్డు కూడలి వరకూ స్టాలిన్ ఓపెన్‌టాప్ వ్యాన్‌పై రోడ్‌షో నిర్వహించారు. దారి పొడవునా వేలాదిమంది పార్టీ కార్యకర్తలు, స్థానికులు స్టాలిన్‌కు జేజేలు పలికారు. రోడ్‌షో ముగిశాక న్యూ జైల్ రోడ్డు జంక్షన్‌లో మదురై తొలి మేయర్ ముత్తు కాంస్య విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు.

### భారీ ఏర్పాట్లు...

డీఎంకే సర్వసభ్యమండలి సమావేశానికి 30 ఎకరాల విస్తీర్ణం కలిగిన మదురై ఉత్తంగుడి కలైంజర్ దిడల్‌లో భారీ పందిరిని నిర్మించారు. ఎయిర్‌కండిషన్ సదుపాయం కలిగిన ఆ పందిరి ప్రవేశద్వారం వద్ద చెన్నైలో ఉన్న అన్నా అరివాలయం ఆకారంతో భారీ సెట్టింగ్‌ను కూడా ఏర్పాటు చేశారు. సుమారు వందమంది ఆసీనులయ్యే రీతిలో వేదికను సిద్ధం చేస్తున్నారు. ఈ సమావేశంలో స్టాలిన్‌తోపాటు ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి , మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, సర్వసభ్యమండలి సభ్యులు పాల్గొననున్నారు. ఈ ఏర్పాట్లన్నీ మంత్రి పి.మూర్తి ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. సర్వసభ్య మండలి సమావేశం ప్రవేశద్వారం వద్ద తాత్కాలిక హరిత వనం మధ్య వాటర్ ఫౌంటెయిన్‌ను ఏర్పాటు చేశారు. ఆ ఫౌంటైన్ నడుమ 100 అడుగుల ఎత్తు పార్టీ స్తంభాన్ని కూడా ప్రతిష్ఠించారు. ఆదివారం ఉదయం సర్వసభ్యమండలి సమావేశం ప్రారంభించడానికి ముందు ఆ స్తంభంపై పార్టీ పతాకాన్ని స్టాలిన్ ఆవిష్కరించనున్నారు. ఇక సమావేశం జరిగే పందిరి దిగువ సుమారు 10 వేలమంది ఆసీనులయ్యేందుకు సీట్లు ఏర్పాట్లు చేశారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే సర్వసభ్య మండలి సమావేశం మధ్యాహ్నం 1గంట వరకు కొనసాగుతుంది. ఈ సమావేశం ముగియగానే అందరూ మధ్యాహ్న భోజనం చేయడానికి ఏసీ సదుపాయంతో డైనింగ్ హాలును కూడా సిద్ధం చేసి ఉంచారు. సుమారు రెండు వేలమందికి వంటగాళ్లు రుచికరమైన పదార్థాలతో వంటకాలను సిద్ధం చేయనున్నారు.

**ముచ్చటగా మూడోసారి...**

డీఎంకే సర్వసభ్యమండలి సమావేశం మదురై నగరంలో నిర్వహించడం ఇది మూడోసారి. తొలిసారిగా 1977 మే నెలలో మదురై సెల్లూరు ప్రాంతంలో సర్వసభ్య మండలి సమావేశం జరిగింది. ఆ తర్వాత 1978 జూన్‌లో మదురై తముక్కం మైదానంలో రెండోసారి సర్వసభ్య మండలి సమావేశం జరిగింది.



వాటర్ ఫౌంటెన్ నడుమ పతాకస్తంభం

## మాస్కు తప్పనిసరి కాదు... ధరించడం మంచిది

- రాష్ట్రంలో 38 కొవిడ్ కేసులు
- భయాందోళనలు వద్దు
- మంత్రి ఎం.సుబ్రమణ్యం



శనివారం మదురై విమానాశ్రయంలోకి మాస్కుతో వచ్చిన ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి

పెరంబూర్, మే 31 (ఆంధ్రజ్యోతి): బహిరంగ ప్రాంతాల్లో మాస్కు ధారణ తప్పనిసరిగా కాదని, అయితే ధరించడం మంచిదని ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం చెప్పారు. నగరంలో శనివారం మంత్రి మీడియాతో మాట్లాడుతూ... దేశంలో కొద్దిరోజులుగా కొవిడ్ కేసుల సంఖ్య అధికమవుతుందన్నారు. కానీ, రాష్ట్రంలో కరోనా వ్యాప్తి నియంత్రణలో ఉందన్నారు. రాష్ట్రంలో 38 మందికి కొవిడ్ లక్షణాలు నిర్ధారణ కాగా, వాటిలో 19 నమూనాలను పుణె ల్యాబ్‌కు పంపామన్నారు. గతంలో రాష్ట్రంలో కొవిడ్‌తో ఒకరు మృతిచెందారని వార్తలు వచ్చాయని, అతనికి కరోనాతో పాటు, దీర్ఘకాలిక అనారోగ్యం ఉందని వివరించారు. ప్రస్తుతం వ్యాప్తిలో ఉన్న ఒమైక్రాన్ రకం వైరస్ ప్రాణాంతకమైనది కాదని, అందువల్ల ప్రజలు భయాందోళనలు చెందాల్సిన అవసరం లేదన్నారు. బహిరంగ ప్రాంతాల్లో ముందు జాగ్రత్త చర్యగా మాస్కు ధరించాలన్నారు. అలాగే, ఇతర అనారోగ్య సమస్యలతో ఉన్న వారు మాస్కు ధరించాలన్నారు. రెండు రోజులకు పైగా జలుబు, దగ్గు, జ్వరం లక్షణాలుంటే వెంటనే ప్రభుత్వాస్పత్రుల్లో పరీక్షలు చేయించుకోవాలన్నారు. కొవిడ్ వ్యాప్తిపై వస్తున్న వదంతులు నమ్మొద్దని మంత్రి సుబ్రమణ్యం కోరారు.

## బీజేపీలోకి మాజీ ఐఏఎస్



రామకృష్ణన్‌కు కండువా కప్పుతున్న నాగేంద్రన్

చెన్నై, మే 31 (ఆంధ్రజ్యోతి): సుమారు 4 దశాబ్దాల పాటు రాష్ట్రానికి సేవలందించిన మాజీ ఐఏఎస్ అధికారి రామకృష్ణన్ రాజగోపాల్ బీజేపీ కండువా కప్పుకున్నారు. శనివారం టి.నగర్‌లోని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యాలయం కమలాలయంలో ఆ రాష్ట్ర అధ్యక్షుడు జి.నయినార్ నాగేంద్రన్ కండువా కప్పి రాజగోపాల్‌కు స్వాగతం పలికారు. 1984 క్యాడర్‌కు చెందిన ఈ ఐఏఎస్ అధికారి కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల్లో వివిధ హోదాల్లో సేవలందించారు. తమిళనాడులోని మూడు జిల్లాలకు కలెక్టర్‌గా వ్యవహరించారు. అనంతరం హోం, రెవెన్యూ, ఎక్సైజ్ వంటి 8 ప్రధాన విభాగాలకు కార్యదర్శిగా సేవలందించారు. చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్‌గా మూడేళ్ల పాటు సేవలందించారు. 2022 డిసెంబరులో పదవీ విరమణ చేశారు. ఈ నేపథ్యంలో బీజేపీలో చేరిన రామకృష్ణన్‌కు నాగేంద్రన్‌తో పాటు సీనియర్ నేత ఎం.చక్రవర్తి తదితరులు స్వాగతం పలికారు. రాష్ట్రంపై ఆయనకున్న అవగాహన తమ పార్టీ అభివృద్ధికి ఎంతో ఉపయోగపడుతుందని ఈ సందర్భంగా నేతలు పేర్కొన్నారు.

## రాందాసే మన కులదైవం

● ఆయన ఆశయాలతోనే పార్టీని నడుపుదాం ● పీఎంకే నేత అన్బుమణి



సమావేశంలో అన్బుమణి బృందం

చెన్నై, మే 31 (ఆంధ్రజ్యోతి): పీఎంకే వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్ పార్టీశ్రేణులందరికీ కులదైవమని, ఆయన ఆశయాలకు అనుగుణంగానే పార్టీని నడుపుతామని ఆ పార్టీ అధ్యక్షుడు డాక్టర్ అన్బుమణి ప్రకటించారు. షోళింగనల్లూరులో రెండోరోజు జిల్లా నేతల సభలో ఆయన ఉద్వేగంగా ప్రసంగించారు. ఇటీవల జరిగిన పార్టీ యువజన మహానాడు రాష్ట్రంలో అన్ని పార్టీలలోనూ గుబులు రేపిందన్నారు. వన్నియార్ల సంక్షేమం కోసమే రాందాస్ పాట్టాలిమక్కల్ కట్చిని నెలకొల్పారన్నారు. పీఎంకే సిద్ధాంతాల పట్ల యువకులు ఆసక్తి కనబరుస్తున్నారని వారికి సభ్యత్వం కల్పించాలన్నారు. పార్టీలో ఊహించని విధంగా ఏవేవో సమస్యలు ఎదురవుతున్నాయని, అవన్నీ త్వరలో సర్దుకుంటాయన్నారు. రాష్ట్రాన్ని ఇప్పటివరకు ఎంతోమంది పరిపాలించారని, ఇక రానున్నది పీఎంకే పాలనేనని అన్బుమణి ప్రకటించారు.

**త్వరలో పాదయాత్ర...**

రాష్ట్ర ప్రజల హక్కులను పరిరక్షించే దిశగా త్వరలో తాను పాదయాత్ర చేపట్టనున్నట్టు అన్బుమణి ప్రకటించారు. పార్టీ అధ్యక్షుడే అన్ని పనులు చేయాలని అనుకోకూడదని, నాయకులంతా కలిసికట్టు అభివృద్ధికి పాటుపడాలన్నారు. రాష్ట్రంలో పీఎంకే పాలన రావాలని పార్టీ మాజీ నాయకుడు దివంగత కాడువెట్టి గురు ఆకాంక్షించేవారని, ఆయన కలను నెరవేరుద్దామన్నారు. పార్టీ శ్రేణులకు తాను అన్నగా, తమ్ముడిగా ఉంటానని, అందరూ ధైర్యంగా పార్టీ కోసం పనిచేయాలన్నారు. తన పిలుపునందుకుని జిల్లా నేతలు పెద్ద సంఖ్యలో తరలిరావటం తనకెంతో ఆనందంగా ఉందని చెప్పారు. తన మనస్సులో ఎంతో బాధ గూడుకట్టుకుని ఉందని, అవన్నీ వెల్లడించలేని పరిస్థితుల్లో ఉన్నానని పేర్కొంటూ తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు.

**ఎమ్మెల్యే గైర్హాజరు..**

అన్బుమణి రాందాస్ షోళింగనల్లూరు మహారాజా మహల్‌లో నిర్వహిస్తున్న జిల్లా నేతలు, ఇన్‌చార్జీల సమావేశానికి పీఎంకే శాసనసభ్యుడు అరుళ్ గైర్హాజరయ్యారు. శుక్రవారం జరిగిన సమావేశంలో చెన్నై, తిరువళ్లూరు, చెంగల్పట్టు, కాంచీపురం, వేలూరు, రాణిపేట సహా 22 జిల్లాలకు చెందిన కార్యదర్శులు, ఇన్‌చార్జీలు, ప్రముఖులు పాల్గొన్నారు. ఆ సందర్భంగా అన్బుమణి రాందాస్ కొత్త సభ్యత్వ కార్డులను పంపిణీ చేశారు. ఆ కార్డులో అన్బుమణి, రాందాస్ ఫొటోలు ముద్రించి ఉన్నాయి. ఇక శనివారం నిర్వహించిన సమావేశానికి ధర్మపురి, సేలం, ఈరోడ్, నామక్కల్, కళ్లకురిచ్చి తదితర జిల్లాలకు చెందిన కార్యదర్శులు, ఇన్‌చార్జీలు, ప్రముఖులు హాజరయ్యారు. ఈ సమావేశానికి సేలం వెస్ట్ పీఎంకే శాసనసభ్యుడు అరుళ్ గైర్హాజరయ్యారు. అదే సమయంలో రాందాస్‌కు కుడిభుజంగా వ్యవహరించిన పార్టీ ప్రధాన కార్యదర్శి వడివేల్ రావణన్ ఉన్నట్టుండి అన్బుమణి నిర్వహిస్తున్న సమావేశంలో కనిపించారు.

### ఆ వ్యాఖ్యలతో బాధ

● జీకే మణి

పార్టీలో చీలికలు రావటానికి, అన్బుమణి, రాందాస్ విడిపోవటానికి తానే కారణమంటూ ప్రసారమాధ్యమాల్లో వస్తున్న వార్తలు ఎంతో బాధపెడుతున్నాయని పీఎంకే గౌరవ అధ్యక్షుడు జీకే మణి అన్నారు. దిండివనం తైలాపురం గార్డెన్‌లో శనివారం మధ్యాహ్నం పీఎంకే వ్యవస్థాపకుడు రాందాస్‌ను కలుసుకున్న అనంతరం జీకే మణి విలేకరులతో మాట్లాడుతూ... పార్టీలో సంక్షోభాన్ని వీలైనంత త్వరగా పరిష్కరించాలని భావిస్తున్నట్టు తెలిపారు. అన్బుమణి, రాందాస్ మధ్య తాను రాయబారం నడుపుతున్నానని చెప్పారు. త్వరలో రాందాస్‌ను అన్బుమణి నేరుగా కలుసుకుని మాట్లాడితే సమస్యలన్నీ సర్దుకుపోగలవని జీకే మణి చెప్పారు.

## రామేశ్వరం ఆలయంలో గవర్నర్ ప్రత్యేక పూజలు

చెన్నై, మే 31 (ఆంధ్రజ్యోతి): రెండు రోజుల తీర్థయాత్రలో భాగంగా రాష్ట్ర గవర్నర్ ఆర్‌ఎన్ రవి సతీసమేతంగా తిరుచ్చి, రామేశ్వరం, మదురై నగరాలలోని దేవాలయాలను సందర్శించారు. తొలుత శుక్రవారం ఉదయం గవర్నర్ రవి, ఆయన సతీమణి లక్ష్మి తిరుచ్చి శ్రీరంగంలోని రంగనాథస్వామివారి ఆలయాన్ని, అక్కడికి చేరువగా ఉన్న తిరువానైక్కావల్ అఖిలాండేశ్వరి అమ్మవారి ఆలయం, సమయపురం మారియమ్మన్ ఆలయాలకు వెళ్లి దైవదర్శనం చేసుకున్నారు. ఆ తర్వాత ముసిరి వెళ్లే మార్గంలో ఉన్న అష్టోత్తర శత వైష్ణవ దివ్యదేశాలలో ఒకటైన గుణశీలం దివ్యక్షేత్రంలోని ప్రసన్న వేంకటాచలపతి ఆలయానికి వెళ్లి శ్రీవారిని దర్శించుకున్నారు. అక్కడ నిర్వహించిన ఆలయ ఉత్సవంలో పాల్గొన్న గవర్నర్ దంపతులకు ఆలయ ట్రస్టీ పిచ్చుమణి అయ్యంగార్ ప్రసాదాలను, ఆలయ స్థలపురాణ గ్రంథాన్ని అందజేశారు. అక్కడి నుంచి కారులో బయలుదేరిన గవర్నర్ రవి సాయంత్రం రామేశ్వరం క్షేత్రానికి చేరుకున్నారు. జిల్లా కలెక్టర్ సిమ్రన్‌జిత్ సింగ్ కాలోన్, డీఎస్పీ సంతోష్ తదితరులు గవర్నర్ దంపతులకు ఘనస్వాగతం పలికారు. ఆ తర్వాత రాత్రి ప్రైవేటు గెస్ట్‌హౌస్‌లో గవర్నర్ బస చేశారు. శనివారం ఉదయం గవర్నర్ దంపతులు అగ్నితీర్థం కడలి ప్రాంతానికి వెళ్ళి పుణ్యస్నానమాచరించారు. అటు పిమ్మట రామేశ్వరం ఆలయంలోని 22 తీర్థబావులలోని తీర్థపు జలాలను శిరస్సుపై చల్లుకున్నారు. ఆ తర్వాత రామనాథస్వామి, పర్వతవర్ధిని అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయంలో జరిగిన స్ఫటిక పూజల్లో పాల్గొన్నారు. అక్కడి నుంచి ధనుష్కోడి, అరిచ్చల్‌మునైలను సందర్శించారు. సాయంత్రం మదురై నగరానికి చేరుకున్నారు. మదురైలోని మీనాక్షి అమ్మవారి ఆలయాన్ని దర్శించారు. ఆ సందర్భంగా ఆలయ నిర్వాహకులు గవర్నర్ దంపతులకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి దర్శన ఏర్పాటు చేశారు. ఆ తర్వాత రెండు రోజుల పర్యటనను ముగించుకుని గవర్నర్ దంపతులు చెన్నైకి తిరిగొచ్చారు. గవర్నర్ పర్యటనను పురస్కరించుకుని రామేశ్వరం, మదురై నగరాలలో సుమారు వెయ్యిమంది పోలీసులు భద్రతా విధులలో పాల్గొన్నారు.



రామేశ్వరం ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న గవర్నర్ ఆర్.ఎన్. రవి, సతీమణి లక్ష్మీరవి

## ఏకతాటిపైకి కమ్మ సామాజికవర్గం

● ఇదే నా లక్ష్యం ● ఈ ఏడాది చివర్లో 10 లక్షల మందితో 'తమిళ కమ్మ మహానాడు'

● కేజీఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు కుసుమ కుమార్

అడయార్, మే 31 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోని కమ్మ సామాజికవర్గాన్ని ఏకతాటిపైకి తీసుకురావడమే తమ లక్ష్యమని 'కమ్మ గ్లోబల్ ఫెడరేషన్' (కేజీఎఫ్) వ్యవస్థాపక అధ్యక్షుడు జెట్టి కుసుమకుమార్ ప్రకటించారు. శనివారం చెన్నై ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కమ్మవారు వ్యాపారస్తులుగానే కాకుండా సినిమా, పారిశ్రామికరంగాల్లో రాణిస్తున్నారన్నారు. కమ్మజాతికి రాజ్యాధికారం ఉండేలా గ్రామస్థాయి నుంచి కమ్మ యువతలో నాయకత్వ లక్షణాలను పెంపొందించి, అన్ని పార్టీల్లో కమ్మవారు ఎదగాలన్న లక్ష్యంతో కేజీఎఫ్ పని చేస్తోందన్నారు. డిసెంబరు లేదా జనవరిలో 10 లక్షల కమ్మ సామాజిక వర్గం ప్రజలతో కేజీఎఫ్ మెగా సమ్మిట్‌ను తమిళ కమ్మ మహానాడుగా జరపాలన్న లక్ష్యాన్ని పెట్టుకున్నామన్నారు. దీనికోసం జూన్ 1న అమింజిగరైలో ఉన్న అయ్యావో మహల్ వేదికగా సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా జూన్ 15న మదురైలో, జూన్ 22న కోయంబత్తూరులోనూ సన్నాహక సమావేశాలు ఉంటాయన్నారు. ఈ సమావేశాల్లో తమిళనాడులో ఉన్న కమ్మ సంఘాల నాయకులంతా పాల్గొనాలని కోరారు. దేశ జనాభాలో ఒకటి నుంచి 1.5 శాతం ప్రజలు కమ్మవారు ఉన్నారన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో కంటే తమిళనాడులోనే తమ సామాజికవర్గ ప్రజలు సుమారుగా 75 లక్షలు ఉన్నారన్నారు. తమ ప్రజల్లో మధ్య తరగతి, దిగువ మధ్య తరగతి వారు ఉన్నారన్నారు. ఆర్థికంగా వెనుకబడిన వారిని ఆదుకుని వారిని కూడా ఉన్నత స్థాయికి తీసుకొచ్చేందు తమ సంస్థ కృషి చేస్తుందన్నారు. విద్యార్థులు సివిల్ సర్వీస్ పరీక్షల్లో రాణించేలా బస సౌకర్యంతో కూడిన ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. ఇప్పటికే బెంగళూరులో ఒక సంస్థతో అవగాహన కూడా ఉందన్నారు. వచ్చే యేడాది తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయని, ఈ ఎన్నికల్లో తమకు కూడా గణనీయంగా టిక్కెట్లు కేటాయించాలని ప్రధాన రాజకీయ పార్టీలను కోరుతామన్నారు. గ్రేటర్ హైదరాబాద్‌లో కూడా తమ వర్గ ప్రజలు మొదటి స్థానంలో ఉన్నారని, అందువల్ల మేయర్ పదవి కమ్మవారికి ఇవ్వాలన్న ప్రతిపాదన చేస్తామని జెట్టి కుసుమకుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంకా కేజీఎఫ్ తమిళనాడు ప్రముఖులు రంగభాష్యం, ముండ్రు శ్రీనివాస్ రావు, ప్రతాప్ నాయుడు, రామన్ నాయుడు, డి.నరేంద్రన్ నాయుడు, నేతాజీ నాయుడు, డి.పురుషోత్తం నాయుడు, టి.సురేష్ తదితరులు కూడా పాల్గొన్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న కుసుమకుమార్ తదితరులు

## సమాచార దర్శిని

### నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, మే 31(ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో చేపట్టనున్న మరమ్మతుల కారణంగా అంబత్తూర్ ఇండస్ట్రియల్ ఎస్టేట్ పరిధిలోని కుళక్కరై వీధి, మారియమ్మన్ ఆలయ వీధి, నార్త్ ఫేస్ సిడ్కో 5 నుంచి 7 వరకు, పొన్నియమ్మన్ ఆలయం 11 నుంచి 13 వరకు, ఈడీ రోడ్డు 1 నుంచి 4 వరకు, రెండవ మెయిన్ రోడ్డు ప్రాంతాల్లో సోమవారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

### గెస్ట్ లెక్చరర్ల నియామకాలకు అనుమతి

పెరంబూర్, మే 31 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలల్లో 1,524 గెస్ట్ లెక్చరర్ల నియామకానికి రాష్ట్రప్రభుత్వం అనుమతించింది. ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలల్లో 'షిఫ్ట్-2' ప్రారంభించేందుకు ప్రభుత్వం అనుమతించిన నేపథ్యంలో, అదనంగా 15,354 మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందనున్నారు. ఈ కళాశాలల్లో మొదటి సంవత్సర పాఠ్యాంశాలకు 421 మంది, రెండో సంవత్సర పాఠ్యాంశాలకు 403, మూడో సంవత్సర పాఠ్యాంశాలకు 406 చొప్పున మొత్తం 1,230 మంది గెస్ట్ లెక్చరర్ల అవసరం ఉంది. వారికి వేతనంగా నెలకు రూ.25,000 చొప్పున 11 నెలలకు రూ.32.77 కోట్లు కేటాయించాల్సి ఉంది. అలాగే, కొత్తగా ప్రారంభించిన 49 కోర్సులకు మూడేళ్లకు కలపి మరో 294 మంది గెస్ట్ లెక్చరర్లను నియమించాల్సి ఉండగా, వారికి వేతనం కింద రూ.7.74 కోట్లు అవసరమవుతోంది. గౌరవ లెక్చరర్ల నియామకానికి అనుమతించాలంటూ ఉన్నత విద్యాశాఖ సిఫారసులతో, గెస్ట్ లెక్చరర్ల నియామకాలకు ప్రభుత్వం అనుమతించిందని అధికారులు తెలిపారు.

### పాత బస్‌పాస్‌లతో ప్రయాణించండి

పెరంబూర్, మే 31 (ఆంధ్రజ్యోతి): గత విద్యా సంవత్సరం (2024-25) అందించిన బస్ పాస్‌లు వినియోగించి విద్యార్థులు ప్రభుత్వ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చని రవాణా శాఖ మంత్రి పి.శివశంకర్ తెలిపారు. వేసవి సెలవులు పూర్తై ఈనెల 2న సోమవారం నుంచి పాఠశాలలు ప్రారంభం కానున్నాయని మంత్రి చెప్పారు. ఆర్ట్స్ కళాశాలలు, ఐటీఐలు కూడా ఈనెలల్లో ప్రారంభం కానున్నాయన్నారు. ఆయా కళాశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు విద్యార్థుల వివరాలను ఆన్‌లైన్‌లో పంపి వారికి కొత్త బస్ పాస్‌లు అందించేందుకు ఆలస్యం అవుతోందన్నారు.ఈ క్రమంలో విద్యార్థులు పాత బస్ పాస్ చూపించి బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చన్నారు. బస్ పాస్ లేని వారు యూనిఫాం ధరించి ఉచితంగా ప్రయాణించవచ్చని తెలిపారు. అలాగే, ప్రభుత్వ బస్సుల్లో ప్రయాణించేందుకు విద్యార్థులను ఇబ్బంది పెట్టొద్దని డ్రైవర్లు, కండక్టర్లను మంత్రి ఆదేశించారు.

### కర్ణాటక సంగీతం డిప్లొమా కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, మే 31 (ఆంధ్రజ్యోతి): 'కర్ణాటక మ్యూజిక్ అడ్వాన్స్డ్ డిప్లొమా' కోర్సులో చేరేందుకు ఈనెల 25వ తేదిలోపు దరఖాస్తు చేసుకోవచ్చని చెన్నై మ్యూజిక్ అకాడమీ పేర్కొంది. 2025-26 విద్యా సంవత్సరంలో మూడేళ్ల ఈ అడ్వాన్స్డ్ డిప్లొమా కోర్సులో చేరే విద్యార్థులకు సోమవారం నుంచి శుక్రవారం వరకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు తరగతులు నిర్వహించనున్నారు. ప్లస్‌టూ ఉత్తీర్ణులైన 18 నుంచి 30 ఏళ్ల లోపు, సంగీతంపై అవగాహన కలిగి ఉండాలి. ఆసక్తి ఉన్న విద్యార్థులు www.musicacadymadras.inలో కానీ నెం.044-28112231, 28115162లలో సంప్రదించవచ్చు.

### తిరువణ్ణామలై గిరి ప్రదక్షిణకు అనుకూల సమయం

పెరంబూర్, మే 31 (ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలై అరుణాచలేశ్వర ఆలయానికి వచ్చే భక్తులు గిరి ప్రదక్షిణకు వెళుతుంటారు. ఆ ప్రకారం వైకాసి నెల పౌర్ణమి గిరి ప్రదక్షిణ సమయాన్ని ఆలయ నిర్వాహకులు ప్రకటించారు. ఆ ప్రకారం, ఈనెల 10వ తేది మధ్యాహ్నం 12.32 గంటలకు ప్రారంభమయ్యే పౌర్ణమి ఘడియలు 11వ తేది మధ్యాహ్నం 1.52 గంటల వరకు కొనసాగుతాయని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

### రాష్ట్రంలో ఏడు రోజులు వర్షసూచన

పెరంబూర్, మే 31 (ఆంధ్రజ్యోతి): నైరుతి రుతుపవనాలు పశ్చిమ కనుమల ప్రాంతాల జిల్లాలకు విస్తరించాయి. దీని ప్రభావంతో నీలగిరి, కోయంబత్తూర్, తెన్‌కాశి, తిరునల్వేలి, కన్నియాకుమారి జిల్లాల్లోని పలు ప్రాంతాలు, తేని, విరుదునగర్ జిల్లాల్లో కొన్ని ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నాయి.ఈ విషయమై చెన్నై వాతావరణ పరిశోధన కేంద్రం విడుదల చేసిన ప్రకటనలో... పశ్చిమ గాలుల వేగంలో మార్పుల కారణంగా, ఆదివారం నుంచి 6వ తేది వరకు రాష్ట్రంలోని ఒకటి, రెండు ప్రాంతాలు, పుదుచ్చేరి,కారైక్కాల్ ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తున్నాయని తెలిపింది. రాజధానినగరం చెన్నైలో రాబోయే 48గంటల్లో ఆకాశం మేఘావృతంగా ఉంటూ,కొన్నిప్రాంతాల్లో తేలికపాటి వర్షాలు కురుస్తాయని వాతావరణకేంద్రం తెలిపింది.

### ఒకేరోజు 8,144 మంది పదవీ విరమణ

పెరంబూర్, మే 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న 8,144 మంది ఒకేరోజు పదవీ విరమణ పొందారు. తాజా గణాంకాల ప్రకారం రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో 9,42,941 మంది పనిచేస్తుండగా, 7.33 లక్షల మంది పింఛన్‌దారులున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు 58 నుంచి 60 ఏళ్లుగా గత అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో పెంచారు. ఉద్యోగంలో చేరిన తేది ఆధారంగా ఉద్యోగులు పదవీవిరమణ పొందుతుంటారు. ముఖ్యంగా, మే నెలలో అధికంగా ఉద్యోగులు పదవీ విరమణ పొందుతుంటారు. పాఠశాలల్లో విద్యార్థులు చేరే సమయంలో వారి వయస్సు తక్కువగా ఉన్న సమయంలో, ఎక్కువ చూపించి పాఠశాలల్లో చేర్పుతుంటారు. ఆ ప్రకారం, మే 31వ తేదీన ఒకేరోజు 8,144 మంది ఉద్యోగులు పదవీ విరమణ పొందారు. గ్రూప్-2 విభాగంలో 424 మంది, బి విభాగంలో 4,399, సి విభాగంలో 2,185 మంది, గ్రూప్-డి విభాగంలో 1,136 మంది పదవీవిరమణ పొందారు. కళాశాల ప్రొఫెసర్లు ఏ విభాగంలోను, ఉపాధ్యాయులు బి విభాగంలో చోటుచేసుకుంటారు. ఈ ఏడాది ఒకే నెలల్లో ఎక్కువ మంది పదవీవిరమణ పొందిన నెలగా మే నిలిచింది. ఆ ప్రకారం, శనివారం పదవీవిరమణ పొందిన వారు 0.86 శాతంగా ఉన్నారు.

# ఎన్నికల పనులు ప్రారంభించండి

● పార్టీ శ్రేణులకు జీకే వాసన్ పిలుపు

చెన్నై, మే 31 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ గెలుపునకు ఇప్పటి నుంచే ప్రచార కార్యక్రమాలను ప్రారంభించాలని, ఎన్నికల పనులను చేపట్టాలని తమిళమానిల కాంగ్రెస్ (టీఎంసీ ) అధ్యక్షుడు జీకే వాసన్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శనివారం ఉదయం జరిగిన పార్టీ నిర్వాహకుల సమావేశంలో ఎన్నికల వ్యూహరచనపై పార్టీ నేతలతో ఆయన చర్చించారు. ఈ సమావేశంలో పార్టీ ప్రధాన కార్యదర్శులు జీఆర్ వెంకటేష్, జవహర్ బాబు, తిరువేంకటం, నంబి, రాజీకృష్ణన్, ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ బాషా, శక్తివడివేల్, జిల్లా నేతల వేళచ్చేరి కేపీ లూయిస్, బిజూ సాకో, గోవిందసామి, మలైయూరు పురుషోత్తమన్, పద్మనాభన్, మహిళా నేతలు కళ్యాణి, నందిని తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల వ్యూహ రచనల కోసం ఏర్పాటైన సమావేశంలో జీకే వాసన్ ఇతర నాయకులు

# వైభవంగా గంగమ్మ జాతర



జాతరలో పాల్గొన్న భక్తులు

వేలూరు, మే 31 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా పేర్నాంబట్టులోని రెడ్డియకుప్పంలో గంగమ్మ ఆలయంలో శుక్రవారం ఉదయం గ్రామోత్సవం వైభవంగా జరిగింది. ఈ నేపథ్యంలో, శనివారం సాయంత్రం అమ్మవారిని ప్రత్యేకంగా పుష్పాలతో అలకరించి వాహనంలో మేళతాళాల నడుమ గ్రామవీధుల్లో ఊరేగించారు. ఇందులో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం భక్తులు అమ్మవారికి అంబలి సమర్పించారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు పోలీసులు భద్రతా విధులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ అధ్యక్షులు అశోకన్, కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## దేశద్రోహం ఆరోపణలతో విద్యార్థి సస్పెన్షన్

● పరీక్ష రాసేందుకు అనుమతిచ్చిన హైకోర్టు

పెరంబూర్, మే 31 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడున్నారనే ఆరోపణలతో సస్పెండ్ అయిన రాజీవ్‌గాంధీ జాతీయ యువజన అభివృద్ధి సంస్థ విద్యార్థి పరీక్ష రాసేందుకు అనుమతించాలని మద్రాసు హైకోర్టు ఆదేశించింది. కాంచీపురం జిల్లా శ్రీపెరుంబుదూర్‌లో ఉన్న రాజీవ్‌గాంధీ జాతీయ యువజన అభివృద్ధి సంస్థలో చదువుతున్న అస్లం, సయీద్, రహల్ దేశ వ్యతిరేక చర్యలు పాల్పడున్నారంటూ పరీక్షల ముందు రోజు కళాశాల నుంచి తాత్కాలికంగా తొలగిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. వాటిని వ్యతిరేకిస్తూ అస్లం మద్రాసు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అందులో... సంస్థ అసిస్టెంట్ రిజిస్ట్రార్ అవినవ్ ఠాగూర్‌పై లైంగిక వేధింపుల ఫిర్యాదు ఉందని, ఆ వ్యవహారంపై ఆయనపై చర్యలు తీసుకోవాలని ఆందోళన చేపట్టానని అస్లం పేర్కొన్నారు. అందువల్ల తప్పుడు ఆరోపణలతో తనను సంస్థ నుంచి తొలగించారన్నారు. సామాజిక సేవ రెండవ సంవత్సరం చదువుతున్న నేపథ్యంలో, ఈ విషయమై తన వివరణ కోరకుండానే తొలగించారన్నారు. ఈ పిటిషన్‌ను హైకోర్టు న్యాయమూర్తి టీవీ తమిళ్‌సెల్వి విచారించారు. వాదనల అనంతరం న్యాయమూర్తి... పిటిషన్‌దారుడిపై వచ్చిన ఆరోపణలు కేవలం ఊహాగానాల ఆధారంగానే ఉన్నాయన్నారు. మొదటి సంవత్సరంలో అన్ని పరీక్షలు ఉత్తీర్ణులైన నేపథ్యంలో, రెండో ఏడాది పరీక్షలకు అనుమతించకపోతే, అతని భవిష్యత్తు నాశనమవుతుందన్నారు. అందువల్ల విద్యార్థి అస్లం పరీక్షలు రాసేందుకు అనుమతించాలని ఉత్తర్వులు జారీ చేసిన న్యాయమూర్తి, ఈ పిటిషన్‌పై రాజీవ్‌గాంధీ జాతీయ యువజన అభివృద్ధి సంస్థ అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణ జూన్ 25వ తేదీకి వాయిదా వేశారు.

## శాసనసభ ఎన్నికలకు ఈసీ సమాయత్తం

● ఓటర్ల నమోదు అధికారుల నియామకం

పెరంబూర్, మే 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 234 శాసనసభ నియోజకవర్గాల్లో ఓటర్ల నమోదు అధికారులను ఎన్నికల సంఘం నియమించింది. రాష్ట్ర శాసనసభ ఎన్నికలు 2026లో జరగనున్నాయి. రాజకీయ పార్టీలు ఇప్పటి నుంచే ఎన్నికలను ఎదుర్కొనేందుకు నేతలు, కార్యకర్తలను సిద్ధం చేస్తున్నాయి. అదే సమయంలో, ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించేలా ఎన్నికల సంఘం ముందస్తు చర్యలు చేపట్టింది. జిల్లా రెవెన్యూ అధికారి, అసిస్టెంట్ కలెక్టర్, డిప్యూటీ కలెక్టర్ హోదా కలిగిన అధికారులను 234 నియోజకవర్గాలకు ఓటర్ల నమోదు అధికారులుగా నియమిస్తూ, ఆ వివరాలను రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి అర్చనా పట్నాయక్ గెజిట్‌లో వెలువరించారు. ఓటర్ల జాబితా పేర్లు చేర్చడం, తొలగించడం, సవరణలు, నియోజకవర్గం, పోలీసు కేంద్రం బదిలీ తదితరాలను ఓటర్ల నమోదు అధికారులు చేపట్టనున్నారని ఈసీ తెలిపింది.

## ప్రభుత్వాస్పత్రిలో ఆకుకూర కొనుగోలులో అవినీతి

● పదవీ విరమణ రోజున మహిళా అధికారి సస్పెన్షన్

పెరంబూర్, మే 31 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాస్పత్రికి ఆకుకూరలు కొనుగోలు చేయడంలో అవినీతికి పాల్పడిన మహిళా అధికారిణి, పదవీ విరమణ పొందే రోజు సస్పెండయ్యారు. తెన్‌కాశి జిల్లా ప్రభుత్వాస్పత్రిలో వైద్యురాలిగా పద్మావతి వ్యవహరిస్తున్నారు.ఆస్పత్రిలోఇన్‌పేషంట్లకు పౌష్టికాహారం అందిస్తుంటారు. ఈ ఆహారంలో వినియోగించేందుకు కొనుగోలు చేస్తున్న ఆకుకూరలు కిలో రూ.25 కాగా, పద్మావతి రూ.80గా చూపుతూ అవినీతికి పాల్పడ్డారణే ఆరోపణలపై ఆరోగ్య శాఖ విచారణ చేపట్టింది. ఈ క్రమంలో, కొద్ది నెలలక్రితం పద్మావతి తూత్తుకుడి ప్రభుత్వ వైద్య కళాశాల ఆస్పత్రికి బదిలీ అయ్యారు. గత నెల చివరన పదవీ విరమణ పొందనున్న పద్మావతి, ఉద్యోగ సమయంలో ఎలాంటి ఆరోపణలు లేవని సర్టిఫికేట్ సమర్పించాలని తూత్తుకుడి ప్రభుత్వాస్పత్రి నిర్వాహకులు లేఖ రాశారు. అయితే తెన్‌కాశి ప్రభుత్వాస్పత్రి అధికారులు... ఆకుకూరల కొనుగోలులో అవినీతికి పాల్పడడంపై విచారణ జరుగుతోందని సర్టిఫికేట్‌లో పేర్కొన్నారు. ఈ సర్టిఫికేట్లో మార్పులు చేసిన పద్మావతి, తనపై ఎటువంటి ఆరోపణలు లేవంటూ నకిలీ సర్టిఫికేట్ సమర్పించింది. ఈ విషయమై అనుమానించిన తూత్తుకుడి ఆస్పత్రి డీన్ తెన్‌కాశి ఆస్పత్రి అధికారులను సంప్రదించారు. దీంతో నకిలీ సర్టిఫికేట్ విషయం వెలుగుచూసింది. ఆమెను తిరువారూర్ జిల్లాకు బదిలీ చేశారు. కాగా, పద్మావతి శనివారం పదవీవిరమణ పొందున్న నేపథ్యంలో, ఆమెను సస్పెండ్ చేస్తూ శుక్రవారం ఆరోగ్యశాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

## మనోన్మణియం వర్సిటీ పరీక్షా పత్రం లీకేజీ

● ఆరు సెక్షన్ల కింద కేసు నమోదు

పెరంబూర్, మే 31 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలి జిల్లా అభిషేకపట్టిలో ఉన్న మనోన్మణియం సుందరనార్ విశ్వవిద్యాలయంలో సెమిస్టర్ పరీక్షకు సంబంధించిన ప్రశ్నపత్రం లీకైన వ్యవహారంపై ఆరు సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ వర్సిటీ పరిధిలోని తిరునల్వేలి, తెన్‌కాశి, తూత్తుకుడి, కన్నియాకుమారి తదితర నాలుగు జిల్లాల్లో 106 కళాశాల సెమిస్టర్ పరీక్షలు 99 కేంద్రాల్లో జరుగుతున్నాయి. టైంటేబుల్ ప్రకారం గత నెల 27వ తేది 'ఇండస్ట్రియల్ లా' పాఠ్యాంశానికి సంబంధించిన సెమిస్టర్ పరీక్ష జరిగింది. పరీక్షా కేంద్రంలోకి విద్యార్థులు ప్రవేశించిన తర్వాత వారికి ప్రశ్నపత్రం అందజేసిన కొద్ది నిమిషాల్లోనే వాటిని తీసుకున్న పరీక్షా కేంద్రం ఇన్విజిలేటర్లు, పరీక్ష వాయిదా వేసినట్లు ప్రకటించారు. ఈ విషయమై వర్సిటీ నిర్వాహకులు మాట్లాడుతూ... ఇండస్ట్రియల్ లా పరీక్షకు సంబంధించిన ప్రశపత్రం లీకైనట్లు సమాచారం అందిందని, అందువల్ల వాయిదా వేసినట్లు తెలిపారు. ఈ వ్యవహారంపై వర్సిటీ రిజిస్ట్రార్ సోక్రటీస్ అందజేసిన ఫిర్యాదులో... గత 26వ తేది రాత్రి 10 గంటలకు వర్సిటీ పరీక్షల అధికారి సెల్‌ఫోన్‌కు వాట్సాప్ ద్వారా ఒక నెంబరు నుంచి మరుసటి రోజు (27వ తేది) జరిగే 'ఇండస్ట్రియల్ లా' ప్రశ్నపత్రం పంపడంతో పరీక్ష రద్దు చేసినట్లు పేర్కొన్నారు. ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారంలో నిందితులను గుర్తించి చర్యలు చేపట్టాలని ఫిర్యాదులో కోరారు. ఈ వ్యవహారంపై తిరునల్వేలి నగర పోలీసులు, కొత్త క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ సెక్షన్లు, తమిళనాడు ప్రభుత్వ పబ్లిక్ పరీక్షల చట్టం 3,4,5 (పరీక్ష మాల్‌ప్రాక్టీస్) కింద కేసు నమోదుచేశారు. పరీక్షల అధికారి సెల్‌ఫోన్ వాట్సాప్‌కు ప్రశ్నపత్రం పంపిన నెంబరుపై విచారించగా, అది అరివుసెల్వన్, మదురై అనే పేరుతో ఉండడంతో, అతనిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### స్వాతంత్ర్య సమరయోధుల వారసుల గ్రీవెన్స్



అధికారులకు దిశానిర్దేశం చేస్తున్న మాలతి

వేలూరు, మే 31 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొన్న సమరయోధుల వారసుల గ్రీవెన్స్ కార్యక్రమాన్ని శనివారం ఉదయం వేలూరు కలెక్టర్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వీఆర్వో మాలతి అధ్యక్షత వహించగా, దేశం కోసం ప్రాణత్యాగం చేసిన వారి కుటుంబాలకు చెందిన వ్యక్తులు పాల్గొని వినతిపత్రాలను అందించారు. సబ్ కలెక్టర్ కలియమూర్తి వినతిపత్రాలను అందుకుని వెంటనే సత్వర చర్యలు చేపట్టాలని ఆయా శాఖలకు చెందిన అధికారులకు ఆదేశాలు జారీచేశారు.

### టీచర్స్ ఫెడరేషన్ సమావేశం



సమావేశంలో టీచర్స్ అసోసియేషన్ నిర్వాహకులు

వేలూరు, మే 31 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా ఫెడరేషన్ ఆఫ్ టీచర్స్ అసోసియేషన్ (ఎఫ్‌టీఏ) ఆధ్వర్యంలో శనివారం ఉదయం టీచర్స్ సమావేశాన్ని ఆ సంఘ నిర్వాహకులు నిర్వహించారు. జిల్లా సెక్రటరీ జనార్దనన్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లాలోని ఉపాధ్యాయులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తిరువళ్లూరు జిల్లా కలెక్టర్ ప్రతాప్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఆర్గనైజర్ బాబు మాట్లాడుతూ... విద్యార్థులను ఉన్నతమైన వారిగా తీర్చిదిద్దే మహోన్నతమైన వృత్తి ఈ ఉపాధ్యాయ వృత్తి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సంఘ నిర్వాహకులు శివ, సెల్వకుమార్, శ్రీనివాసన్, అమృతరాజ్, జయప్రకాశ్, దినకరన్ పాల్గొన్నారు.

### పాల ఉత్పత్తిదారులకు బహుమతుల పంపిణీ




వేలూరు, మే 31 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా అనైకట్టు సమీపంలో కో-ఆపరేటివ్ పాల ఉత్పత్తి కేంద్రం నిర్వాహకుల ఆధ్వర్యంలో పాల ఉత్పత్తిదారులకు బహుమతి ప్రదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో నాణ్యమైన పాలను అందించిన పలువురు ఉత్పత్తిదారులను ప్రభుత్వ పాడిపరిశ్రమలశాఖ అధికారులు అభినందించారు. ఈ కార్యక్రమంలో పాల ఉత్పత్తులశాఖ అసిస్టెంట్ మేనేజర్ విధియ, ఆర్గనైజర్లు వివేక్, విజయశ్రీ ప్రభాకరన్, నరసింహన్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రముఖ వస్త్ర దుకాణం సీజ్

అడయార్, మే 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోడంబాక్కంలోని ప్రముఖ వస్త్ర దుకాణాన్ని చెన్నై నగర పాలక సంస్థ అధికారులు సీజ్ చేశారు. కోడంబాక్కం పదో జోన్ 136వ వార్డు, అన్నా మెయిన్ రోడ్డులో శరవణ స్టోర్ వస్త్ర దుకాణం ఉండగా, ఇందులో గ్రౌండ్ ఫ్లోర్‌తో సహా మూడు అంతస్తుల నిర్మాణానికి మాత్రమే చెన్నై కార్పొరేషన్ నుంచి అనుమతి తీసుకున్నారు. ఇందులో గ్రౌండ్‌ఫ్లోర్ పార్కింగ్‌కు కేటాయించేలా ప్లాన్‌ను రూపొందించారు. అయితే, నిబంధనలకు విరుద్ధంగా గ్రౌండ్ ఫ్లోర్‌ను పార్కింగ్‌కు కేటాయించకుండా పక్కా నిర్మాణాలు చేపట్టారు. ఈ విషయాన్ని తెలుసుకున్న కార్పొరేషన్ అధికారులు.. స్థానిక పోలీసుల బందోబస్తు మధ్య ఆ వస్త్ర దుకాణాన్ని తనిఖీ చేసి సీజ్ చేసి, నోటీసు అంటించారు.


## మురుగన్ సేవలో ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక విభాగ ఎస్పీ



ఆలయ నిర్వాహకులతో ఆర్‌ఎస్‌పీయూ ఎస్పీ శ్రీనివాస్

తిరుత్తణి, మే 31 (ఆంధ్రజ్యోతి): తిరుపతి శేషాచలం అటవీశాఖ రెడ్ శాండిల్ స్మగ్లింగ్ ప్రివెన్షన్ యూనిట్ (ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక విభాగం) ఎస్పీ పి.శ్రీనివాస్ శనివారం ఉదయం తిరువళ్లూరు జిల్లా తిరుత్తణిలో ప్రసిద్ధి చెందిన మురుగన్ ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు ఆయనకు శాలువా కప్పి, సాదర స్వాగతం పలికారు. అనంతరం ఆయన మురుగన్‌కు ప్రత్యేక అభిషేక కార్యక్రమాలు నిర్వహించారు. దర్శనానంతరం శ్రీనివాసన్‌కు ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందించారు. శ్రీనివాస్ వెంట ఇన్‌స్పెక్టర్లు సాయిగిరిధర్, సురేష్‌కుమార్, ఏసీఎఫ్ శ్రీనివాస్ తదితరులు కూడా ఉన్నారు.

## మాజీ డీజీపీ రాజ్‌మోహన్ కన్నుమూత



చెన్నై, మే 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మాజీ డీజీపీ ఎ.రాజ్ మోహన్ శుక్రవారం వేకువజాము మృతి చెందారు. ఆయన వయస్సు 87 సంవత్సరాలు. గత కొద్ది రోజులుగా వృద్ధాప్య సమస్యల కారణంగా తీవ్ర అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వచ్చారు. చివరకు చికిత్సలు ఫలించక కన్నుమూశారు. కడలూరు జిల్లా కురింజిపాడికి చెందిన ఎ.రాజ్‌మోహన్ ఐపీఎస్‌లో ఉత్తీర్ణుడై 1960 రాష్ట్ర పోలీసు శాఖలో చేరారు. పోలీసు శాఖలో ఏఎస్పీ నుంచి డీజీపీ వరకు వివిధ పదవుల్లో సేవలందించి నిజాయితీ పోలీసు ఉన్నతాధికారిగా పేరు తెచ్చుకున్నారు. 1996 ఆగస్టులో డీజీపీగా పదవీ విరమణ చేశారు. రాజ్‌మోహన్ యువతను ఉత్సాహపరిచే రీతిలో ఎన్నో రచనలు చేశారు. 'వాళ్క్కై ఒరు వాయ్‌ప్పు' (జీవితం ఒక అవకాశం) అనే పేరుతో ఆయన రచించన పుస్తకం కేరళ విశ్వవిద్యాలయంలో పాఠ్యాంశంగా ఉంటోంది. తన తల్లిదండ్రుల పేరిట ఆయన 'ఏజే ట్రస్టు' పేరుతో సేవా సంస్థను ఏర్పాటు చేసి పేదలకు సహాయం చేశారు. రాజ్‌మోహన్‌కు కుమారుడు రవిమోహన్, కుమార్తె గీతా ఉన్నారు. శుక్రవారం సాయంత్రం బిసెంట్‌నగర్ విద్యుత్ దహనవాటికలో ఆయన అంత్యక్రియలు జరిగాయి.

## ఓఎన్జీసీ పైప్‌లైన్‌లో గ్యాస్ లీక్

### గ్రామస్తుల రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న గ్రామస్తులు

చెన్నై, మే 31 (ఆంధ్రజ్యోతి): మైలాడుదురై జిల్లా కుత్తాలం సమీపం క్షేత్రపాలపురంలో ఓఎన్జీసీ పైప్‌లైన్‌లో గ్యాస్ లీకైంది. దీనితో భీతిల్లిన స్థానికులు ఆ పైప్‌లైన్‌ను మార్చాలని, కొత్తది వేయాలని రాస్తారోకో చేపట్టారు. క్షేత్రపాలపురం సమీపం గాంధీనగర్ కీళ్‌కాలనీ ప్రాంతంలోని ఓ పంటపొలంలో ఓఎన్జీసీ పైప్‌లైన్‌లో ఉన్నట్టుండి గ్యాస్ లీకైంది. ఈ విషయాన్ని ఓఎన్జీసీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. దీంతో గ్రామస్తులు కుంభకోణం - మైలాడుదురై రహదారిలో రాస్తారోకో జరిపారు. ఈ విషయం గురించి తెలుసుకున్న ఓఎన్జీసీ అధికారులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఆ తర్వాత ఇంజనీరింగ్ నిపుణులు ఆ పైప్‌లైన్‌కు మరమ్మతులు చేపట్టారు. దీంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు.

## ఫుట్‌బాల్ ఆడుతూ బాలుడి మృతి

పెరంబూర్, మే 31 (ఆంధ్రజ్యోతి): ఫుట్‌బాల్ ఆడుతున్న బాలుడు హఠాత్తుగా స్పృహ తప్పి మృతిచెందాడు. ఈ ఘటన కోయంబత్తూర్ జిల్లాలో జరిగింది. కుడియకరై ప్రాంతానికి చెందిన సెంథిల్‌కుమార్, మైథిలి దంపతుల కుమారుడు కృతిక్(14) 9వ తరగతి ఉత్తీర్ణులై 10వ తరగతికి వెళ్లనున్నాడు. ప్రస్తుతం వేసవి సెలవులు కావడంతో కోవై శరణంపట్టిలోని ఫుట్‌బాల్ క్రీడా మైదానంలో ఫుట్‌బాల్ శిక్షణ పొందుతున్నాడు. శిక్షణలో పాల్గొన్న విద్యార్థుల మధ్య శుక్రవారం సాయంత్రం పోటీ నిర్వహించారు. ఒక జట్టులో ఆడుతున్న కృతిక్, ఆటమధ్యలో హఠాత్తుగా స్పృహతప్పి పడిపోయాడు. కోచ్‌లు, సహచార క్రీడాకారులు అతన్ని వెంటనే సమీపంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా, మార్గమధ్యంలో అతను మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారిం చారు. ఈ ఘటనపై శరవణంపట్టి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

### వివాహానికి తల్లిదండ్రుల నిరాకరణ

## రైలు కింద పడి ప్రేమ జంట ఆత్మహత్య

చెన్నై, మే 31 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు వివాహానికి అంగీకరించకపోవడంతో రైలు కింద పడి ప్రేమ జంట వేర్వేరుగా ఆత్మహత్యకు పాల్పడిన ఘటన తిరపత్తూర్ జిల్లాలో జరిగింది. ఆంబూరు సమీపం పెరియాంకుప్పానికి చెందిన నితిన్‌గోకుల్(20) కర్ణాటకలోని ఓ ప్రైవేటు కళాశాలలో రెండవ సంవత్సరం నర్సింగ్ చదువుతున్నాడు. జోలార్‌పేట సమీపం కావేరిపట్టుకి చెందిన ధరణి(20) కూడా గోకుల్ కళాశాలలోనే నర్సింగ్ చదువుతోంది. ఇద్దరి మధ్య ఏర్పడిన పరిచయం ప్రేమగా మారడంతో ధరణి 9 నెలల గర్భిణి. తమకు వివాహం చేయాలని గోకుల్ తల్లిదండ్రులను కోరగా వారు నిరాకరించినట్లు సమాచారం. దీంతో, మనస్తాపం చెందిన గోకుల్ శుక్రవారం రాత్రి పెరియాంకుప్పం రైలు పట్టాలపై ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సమాచారం తెలుసుకున్న ధరణి, శనివారం వాణియంబాడి రైల్వేస్టేషన్‌కు వెళ్లి ఆ సమయంలో తిరువనంతపురం నుంచి చెన్నైకి వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ కింద పడి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనపై జోలార్‌పేట పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

## నర్సు నిర్లక్ష్యం: తెగిన పసికందు చేతివేలు

వేలూరు, మే 31 (ఆంధ్రజ్యోతి): వేలూరులోని ముళ్ళిపాళయంకు చెందిన విమల్‌రాజ్ గత శనివారం తన భార్య నివేదను ఓ ప్రభుత్వాస్పత్రిలో చేర్చాడు. ఈ క్రమంలో ఆమె మగబిడ్డకు జన్మనిచ్చింది. బిడ్డ బరువు తక్కువగా ఉండటంతో గ్లూకోస్ ఎక్కించేందుకు చిన్నారుల విభాగం గదికి ఆ బిడ్డను నర్సు తీసుకెళ్ళారు. ఈ నేపథ్యంలో, శిశువు చేతికి ఇంజక్షన్ వేసేందుకు వచ్చిన మరో నర్సు, చేతిలో ఆపరేషన్ చేసే కత్తిని పట్టుకుని నిర్లక్ష్యంగా బిడ్డ ఎత్తుకోవడంతో ఆ కత్తి తగిలి బిడ్డ కుడిచేతి బొటనివేలు కట్ అయ్యింది. ఇది తెలిసిన శిశువు తల్లిదండ్రులు ఆస్పత్రి చీఫ్ డాక్టర్‌కు ఫిర్యాదు చేయగా, వెంటనే అంబులెన్స్‌లో ప్రైవేటు ఆస్పత్రికి ఆ బిడ్డను తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని దీనిపై కేసు నమోదు చేసుకుని విచారణ చర్యలు చేపట్టారు.

## బైక్‌ను దొంగిలించబోయిన ఇద్దరి అరెస్ట్



నిందితులు కల్యాణ్, నందు

తిరుత్తణి, మే 31 (ఆంధ్రజ్యోతి): తిరుత్తణి సమీపంలోని పొదటూర్ పేటలో నిలిపి ఉన్న బైక్‌ను చోరీ చేయబోయిన ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. పొదటూర్‌పేటలోని కాంచీపురం వీధికి చెందిన సుందరం శుక్రవారం రాత్రి తన ఇంటి వెలుపల బైక్‌ను పార్క్ చేశాడు. ఆ బైక్‌ను ఇద్దరు యువకులు దొంగిలించే ప్రయత్నం చేశారు. ఇది గమనించిన ఓ వ్యక్తి పెద్దగా కేకలేయడంతో భయంతో పరుగులు తీశారు. ఆ సమయంలో చుట్టుపక్కల వారు వారిని వెంబడించి పట్టుకుని దేహశుద్ధి చేశారు. సమా చారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వారిని అదుపులోకి తీసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నగరి సమీపంలోని ఓజీకుప్పానికి చెందిన కల్యాణ్, నందుగా విచారణలో గుర్తించారు. వీరిపై కేసు నమోదుచేసిన పోలీసులు కోర్టు ఉత్తర్వుల మేరకు రిమాండ్‌కు తరలించారు.

## పదవీ విరమణ పొందిన అధికారికి సన్మానం




దాస్ ప్రకాశ్ దంపతులు

తిరుత్తణి, మే 31 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టు తాలూకాలోని పెరుమాళ్‌నెల్లూరు సహకారం సంఘ పంచాయతీ కార్యదర్శిగా పదవీ విరమణ పొందిన దాస్‌ప్రకాశ్‌ను ఆ శాఖ అధికారులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సహచర ఉద్యోగులు మాట్లాడుతూ... దాస్‌ప్రకాశ్ సేవలను కొనియాడారు. అందరితో స్నేహ పూర్వకంగా మెలిగేవారని చెప్పారు. అనంతరం దాస్‌ప్రకాశ్ దంపతులకు పూలమాలలు వేసి, శాలువాతో సత్కరించారు.

## మాజీ మంత్రి ఇంటి ముందు పేలుడు పదార్థాలు

పుదుచ్చేరి, మే 31 (ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి మాజీ మంత్రి ఇంటి ముందు పేలుడు పదార్థాలు లభ్యంకావడంతో స్థానికంగా కలకలం రేగింది. కొన్ని రోజులుగా పుదుచ్చేరిలోని ప్రభుత్వ ఉన్నతాధికారులు, రాజకీయ నేతలకు బాంబు బెదిరింపులు వస్తున్నాయి ఈ నేపథ్యంలో సుబ్రేన్ వీధిలో కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ మంత్రి షాజహాన్ ఇంటి ముందు పేలుడు పదార్థాలను గుర్తు తెలియని వ్యక్తులు పెట్టారు. ఈ విషయం తెలుసుకున్న స్థానికులు పోలీసులకు సమాచారం చేరవేయగా, వారు హుటాహుటిన అక్కడకు చేరుకుని వాటిని సురక్షితంగా సేకరించి తీసుకెళ్లారు. కాగా, గత కొన్ని రోజులుగా పుదుచ్చేరి రాజ్‌భవన్, ముఖ్యమంత్రి నివాసం, జిల్లా కలెక్టర్ కార్యాలయం, జిప్మర్, ప్రభుత్వ ఆస్పత్రులకు బాంబు బెదిరింపులు వస్తున్న విషయం తెల్సిందే. ఇపుడు ఏకంగా మాజీ మంత్రి ఇంటి ముందు పేలుడు పదార్థాలు లభించడం కలకలం రేపింది.

# బూత్ కమిటీల ఏర్పాటును పూర్తి చేయండి

● జిల్లా నేతలకు ఈపీఎస్ ఆదేశం

చెన్నై, మే 31 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండటంతో పార్టీ బూత్ కమిటీలను రెండు వారాల్లోగా ఏర్పాటు చేయాలని పార్టీ జిల్లా శాఖ నాయకులకు అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) ఆదేశించారు. అసెంబ్లీ ఎన్నికల వ్యూహ రచనలపై సమగ్రంగా చర్చించడానికి రాయపేటలోని పార్టీ ప్రధాన కార్యాలయం ఎంజీఆర్ మాళిగైలో జిల్లా కార్యదర్శుల సమావేశం శుక్రవారం ఉదయం ప్రారంభమైన శనివారం సాయంత్రం ముగిసింది. ఈ సమావేశాల్లో అసెంబ్లీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై జిల్లా కార్యదర్శులు, ఇన్‌చార్జీలతో ఈపీఎస్ చర్చించారు. ఈ సమావేశానికి 82 జిల్లాల కార్యదర్శులు, ఇన్‌చార్జీలు హాజరయ్యారు. బూత్ కమిటీలు పటిష్ఠంగా ఉంటేనే అసెంబ్లీ ఎన్నికల్లో సునాయాసంగా గెలువగలమని ఈపీఎస్ చెప్పారు. డీఎంకే ప్రభుత్వం గత నాలుగేళ్ల పాటు సాగిస్తున్న అవినీతిపాలనపై గ్రామస్థాయిలో ముమ్మర ప్రచార కార్యక్రమాలు జరపాలని ఆయన దిశానిర్దేశం చేశారు.



వేసవి సెలవులు ముగిసి ఈనెల 2న సోమవారం నుంచి పాఠశాలలు ప్రారంభం కానున్నాయి. పాఠశాలల ప్రాంగణం, తరగతి గదులను శుభ్రం చేసే పనులు వేగవంతమయ్యాయి. పాఠశాలల ప్రారంభించిన తొలిరోజే విద్యార్థులకు పాఠ్య, నోటు పుస్తకాలు, యూనిఫాం, బ్యాగ్, షూస్ తదితరాలు అందించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 37,211 ప్రభుత్వ పాఠశాలలు, 8,403 ఎయిడెడ్ పాఠశాలలు, 12,631 ప్రైవేటు పాఠశాలలున్నాయి. రాష్ట్ర పాఠ్య ప్రణాళికలో 2024-25వ విద్యా సంవత్సరానికి ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో 1 నుంచి ప్లస్‌టూ తరగతులకు వార్షిక పరీక్షలు పూర్తై ఏప్రిల్ 27 నుంచి వేసవి సెలవులు ప్రారంభమయ్యాయి. జూన్ 2వ తేది నుంచి పాఠశాలు పునఃప్రారంభమవుతాయని విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్ ప్రకటించారు.

- పెరంబూర్, ఆంధ్రజ్యోతి




తరగతి గదిలో ఫాగింగ్ చేస్తున్న ఉద్యోగులు


లంచ్ బాక్స్ బాగుంది కదూ... వీక్షిస్తున్న విద్యార్థిని


విక్రయానికి సిద్ధంగా రంగురంగుల బాక్స్‌లు


విద్యార్థులకు అందించనున్న షూ, పాదరక్షలు

# బడులకు వేళాయెరా!

- సిద్ధమవుతున్న తరగతి గదులు
- తొలిరోజే పాఠ్యపుస్తకాలు, యూనిఫాం పంపిణీ


ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాల విద్యార్థులకు పంపిణీ సిద్ధంగా యూనిఫాం


SUNDAY SPECIAL

పాఠ్య పుస్తకాలు సరిచూస్తున్న ఉపాధ్యాయులు

**యూనిఫాం, పాఠ్యపుస్తకాలు...** పాఠశాలలు ప్రారంభించిన తొలిరోజే విద్యార్థులకు పాఠ్య, నోటు పుస్తకాలు, యూనిఫాం అందజేయనున్నట్లు పాఠశాల విద్యాశాఖ ప్రకటించింది. ఈ మేరకు జిల్లా కేంద్రాల నుంచి పాఠశాలలకు వాటిని వాహనాల్లో తరలిస్తున్నారు. జిల్లా, తాలూకా విద్యాధికారుల సమక్షంలో ఈ పనులు జరుగుతున్నాయి. అలాగే, తొలిరోజున విద్యార్థులకు స్వాగతం పలికేలా ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. ఇందుకనుగుణంగా ప్రధానోపాధ్యాయుల నేతృత్వంలో ఉపాధ్యాయులు ఏర్పాట్లు చేపడుతున్నారు. ఇక, నోటు పుస్తకాలు, బ్యాగులు, విద్యా ఉపకరణాలు విక్రయించే దుకాణాలు విద్యార్థులు, తల్లిదండ్రులతో సందడిగా మారాయి. విద్యార్థులు తమకిష్టమైన బ్యాగులు, బాక్స్, వాటర్ బాటిళ్లు, లంచ్ బాక్సులు ఆసక్తిగా కొనుగోలు చేస్తున్నారు.

**సిద్ధమవుతున్న తరగతి గదులు...** : నెలకు పైగా తాళాలు వేసిన పాఠశాల ప్రాంగణాలు, తరగతి గదులను శుభ్రం చేసే పనులను సిబ్బంది చేపట్టారు. పాఠశాల విద్యాశాఖ రూపొందించిన విధివిధానాల ప్రకారం, తరగతి గదులు శుభ్రం చేయడం, సున్నం, రంగులద్దడం, విద్యుత్ సాధనాల్లో మరమ్మతులు, గదుల్లో ఫాగింగ్ తదితరాలు ముమ్మరంగా జరుగుతున్నాయి. పాఠశాలల ప్రాంగణాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం తొలగించే పనులు తుదిదశకు చేరుకున్నాయి.

## సీనియర్ నటుడు రాజేష్‌కు రజనీ నివాళులు



అనారోగ్యం కారణంగా మరణించిన సీనియర్ సినీ నటుడు రాజేష్ (75) భౌతికకాయానికి సూపర్‌స్టార్ రజనీకాంత్ శనివారం నివాళులర్పించారు. బుధవారం ఉదయం మృతి చెందిన రాజేష్ పార్థివదేహాన్ని సినీ, రాజకీయ ప్రముఖులు, అభిమానుల సందర్శనార్థం స్థానిక రామాపురంలో ఉన్న రాజేష్ స్వగృహంలో ఉంచారు. శనివారం అక్కడికి వెళ్లిన రజనీకాంత్... రాజేష్ పార్థివదేహానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. అంతకుముందు రాజేష్ మృతి పట్ల రజనీ తన సంతాపాన్ని వ్యక్తం చేస్తూ... 'రాజేష్ ఎలా జీవించారన్నదానికి ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, సంగీత దర్శకుడు ఇళయరాజా వంటివారు స్వయంగా నివాళులర్పించడమే నిదర్శనం. సినిమా, రాజకీయాలు, విజ్ఞానం, సాహిత్యం ఇలా పలు రంగాల్లో ప్రావీణ్యం ఉన్న బహుముఖ ప్రజ్ఞాశాలి. ఒక మంచి మనిషి. మంచి స్నేహితుడుని కోల్పోయా. చిత్రపరిశ్రమకు తీరని లోటు. ఆయన అకాల మరణం తీవ్ర మనోవేదనకు గురిచేసింది. రాజేష్ ఆత్మకు శాంతి కలగాలని దేవుడుని ప్రార్థిస్తున్నా' అని పేర్కొన్నారు. కాగా, రాజేష్ పార్థివదేహానికి సీఎం స్టాలిన్, వీసీకే అధినేత తిరుమావళవన్, తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్, దిగ్గజ సంగీత దర్శకుడు ఇళయరాజా, నటులు పార్తిబన్, సత్యరాజ్, శివకుమార్, విశాల్, నాజర్, కార్తి, అజయ్‌రత్నం, వయ్యాపురి, ఎం.ఎస్. భాస్కర్, పేరరసు తదితర సినీ ప్రముఖులు నివాళులర్పించిన విషయం తెల్సిందే. అలాగే, ఆయన అంత్యక్రియలు శనివారం కేఎంసీలోని శ్మశానవాటికలో పూర్తి చేశారు.


రాజేష్ పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న రజనీ

చిత్రజ్యోతి

# శివాజ్ఞ మేరకే 'కన్నప్ప'ని నిర్మించా


విలేకరుల సమావేశంలో చిత్రబృందం

- మంచు విష్ణు

పరమశివుడు అనుగ్రహం, ఆజ్ఞ మేరకే 'కన్నప్ప' చిత్రాన్ని నిర్మించే అదృష్టం తమకు దక్కిందని ఆ చిత్ర హీరో మంచు విష్ణు అన్నారు. బాలీవుడ్ దర్శకుడు ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వంలో మంచు మోహన్‌బాబు, మంచువిష్ణు, ప్రభాస్, అక్షయ్‌కుమార్, మోహన్‌లాల్, మధుబాల వంటి అగ్రనటీనటులు నటించిన 'కన్నప్ప' చిత్రం ఈనెల 27న విడుదలకానుంది. ఈ చిత్ర ప్రచార కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం చెన్నైలో మీడియాకు సినిమాలోని కొన్ని క్లిప్పింగులకు ప్రత్యేకంగా ప్రదర్శించారు. అనంతరం మంచు విష్ణు మీడియాతో మాట్లాడుతూ... 'ఈ సినిమాను చిత్రీకరించే అదృష్టం ఆ శివయ్యే కల్పించారు. ఇందులో నేను కన్నప్ప నాయనార్‌గా నటించా. ఆ కాలంలో జరిగిన కథ కావడంతో చిత్రీకరణ కోసం న్యూజిలాండ్‌ను ఎంచుకున్నాం. షూటింగ్ వేడి, శీతల ప్రదేశాల్లో చేశాం. ఈ సినిమా షూటింగ్ కోసం శివలింగాన్ని ప్రతిష్ఠించగా దానికి సాలెపురుగు గూడు కట్టడం విశేషం. ఇది నిజమైన కన్నప్ప నాయనార్‌కు సంబంధించిన కథ. దేశవ్యాప్తంగా ప్రముఖ నటీనటులు ఇందులో నటించారు. శ్రీకాళహస్తి పురాణం, పాటలు సంబంధిత అంశాలను ప్రధానాంశాలుగా చేసుకుని చిత్రీకరించాం. ఇందులో అక్షయ్‌కుమార్, కాజల్‌అగర్వాల్ శివపార్వతులుగా నటించారు. వెండితెరపై వారిద్దరు నిజంగానే శివపార్వతులుగా ఉంటారు. నా ఇద్దరు కవల పాపలతో పాటు కుమారుడు కూడా ఇందులో నటించారు. 'కన్నప్ప' సెన్సార్‌కు అనేక చిక్కులు ఎదురవుతున్నాయి. అనేక సీన్లపై సెన్సార్ కమిటీ అభ్యంతరాలు తెలుపుతోంది. వచ్చేవారం సెన్సార్ కావొచ్చని భావిస్తున్నాం. ఆ సెన్సార్ పూర్తి చేసే భారాన్ని శివయ్యపై వేశా. ఈ చిత్ర కథ కల్పితం కాదు. పురాణాల్లో ఉన్నదాన్నే చూపించబోతున్నాం' అని పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో నటి మధుబాల, దర్శకుడు ముఖేష్ కుమార్ సింగ్, నటుడు సంపత్‌రామ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్చ్... ఒక్క ముద్దు సీనులో నటించలేదు : విష్ణు విశాల్


'ఓహో ఎందన్ బేబీ'లో ఓ దృశ్యం

తాను ఇప్పటివరకు 21 చిత్రాల్లో నటించానని, కానీ, ఒక్క చిత్రంలో కూడా హీరోయిన్‌తో ముద్దు సన్నివేశంలో నటించలేదని హీరో విష్ణు విశాల్ గుర్తు చేశారు. తన సోదరుడు రుద్రను హీరోగా పరిచయం చేస్తూ విష్ణువిశాల్ నిర్మించిన చిత్రం 'ఓహో ఎందన్ బేబీ'. బాలీవుడ్ నటి మిథిలా పాల్కర్ హీరోయిన్. కృష్ణకుమార్ రామ్‌కుమార్ దర్శకుడు. విష్ణు విశాల్ ప్రొడక్షన్ స్టూడియో, రోమియో పిక్చర్స్, గుడ్‌షో సంస్థ సంయుక్తంగా నిర్మించాయి. జెన్ మార్టిన్ సంగీత దర్శకత్వం వహించిన ఈ చిత్రానికి సహ నిర్మాతలు కేవీ దురై, జావిద్, నిర్మాతలు రాహుల్, విష్ణువిశాల్. జూలైలో విడుదలకానుంది. మూవీ ఫస్ట్ గ్లింప్స్‌ను తాజాగా విడుదల చేశారు. ఈ నేపథ్యంలో విష్ణువిశాల్, హీరో రుద్ర, దర్శకుడు కృష్ణకుమార్ మీడియాతో ముచ్చటించారు. విష్ణువిశాల్ మాట్లాడుతూ... 'నా తమ్ముడు రుద్రను ఈ చిత్రం ద్వారా హీరోగా పరిచయం చేస్తున్నా. ప్రముఖ దర్శకుడు ఏఆర్ మురుగదాస్ వద్ద అసిస్టెంట్ డైరెక్టరుగా పనిచేశారు. సినిమాలోని అన్ని విభాగాలపై మంచిపట్టుంది. మంచి స్టోరీ లైన్ చెబుతుంటాడు. ప్రతి అంశంపై అవగాహన ఉంది. నేను ఎలాంటి బ్యాక్‌గ్రౌండ్ లేకుండా చిత్రపరిశ్రమలో అడుగుపెట్టా. కానీ రుద్రకు చిన్నప్పటి నుంచి సినిమాపై అవగాహన ఉంది. మా చిన్నాన్నకు సినిమా గురించి బాగా తెలుసు. ఆయన ద్వారా అనేక విషయాలు తెలుసుకున్నాం. రుద్రకు తొలి చిత్రంలోనే ముద్దు సన్నివేశంలో నటించే అవకాశం వచ్చింది. అదీ అదృష్టమంటే. నేను 21 సినిమాల్లో నటించా. ఒక్క సినిమాలో కూడా హీరోయిన్‌ను ముద్దుపెట్టుకోలేదు. మా సొంత నిర్మాణ సంస్థలో రుద్రను హీరోగా పరిచయం చేయడం సంతోషంగా ఉంది. రోమియో పిక్చర్స్ అధినేత, డిస్ట్రిబ్యూటర్ రాహుల్ నేను మంచి స్నేహితులం. ఈ స్టోరీ వినగానే అతనే సొంతంగా నిర్మించేందుకు ముందుకు వచ్చారు' అన్నారు. దర్శకుడు కృష్ణకుమార్ మాట్లాడుతూ... 'ఇది ఒక రొమాంటిక్ డ్రామా. రుద్ర హీరోగా నటించినా, విష్ణువిశాల్ పాత్ర కూడా కీలకం. సినిమాపై రుద్రకు మంచి అవగాహన ఉండటంతో ముద్దు సన్నివేశాల్లో ఏమాత్రం బిడియం లేకుండా నటించారు' అన్నారు. హీరో రుద్ర మాట్లాడుతూ... 'మురుగదాస్ వద్ద అసిస్టెంట్‌గా పనిచేశా. 'ఎఫ్ఐఆర్' చిత్రానికి అన్న విష్ణువిశాల్‌తో కలిసి పనిచేశాను. చిన్నప్పటి నుంచి సినిమా అంటే ప్యాషన్. అసిస్టెంట్ డైరెక్టరుగా ఉన్నపుడు కాస్త లావుగా ఉండేవాడిని. హీరో కోసం స్లిమ్‌గా మారా. తొలిసారి ముద్దు సన్నివేశంలో నటిస్తుంటే కాస్త భయంగా ఉంది. కానీ, స్క్రిప్టు డిమాండ్ మేరకు దర్శకుడు చెప్పినట్టుగా ఆ సీన్‌లలో నటించా. అన్నను ఆదరించినట్టుగానే మీడియా కూడా నాకు సపోర్టు చేయాలి' అని కోరారు.

## ఈ కాలంలో ముద్దు సీన్లు సర్వసాధారణం

- అభిరామి



అగ్ర నటుడు కమల్ హాసన్‌తో నటించిన ముద్దు సన్నివేశానికి ప్రాధాన్యం ఉందని, అయితే, ఈ కాలంలో ఆ తరహా సీన్లలో నటించడం సర్వసాధారణమని నటి అభిరామి అన్నారు. మణిరత్నం - కమల్ కాంబోలో తెరకెక్కిన చిత్రం 'థగ్ లైఫ్'. ఈనెల 5న విడుదలకానుంది. ఈ చిత్రం ట్రైలర్ రిలీజ్ కాగా, అందులో కమల్, అభిరామి మధ్య ముద్దు సన్నివేశం ఉంది. 70 యేళ్ల కమల్‌కు అభిరామికి ముద్దు సీన్ ఏంటి? అనే విమర్శలు వచ్చాయి. వీటిపై అభిరామి స్పందించారు. 'సినిమా చూస్తే ముద్దు సన్నివేశానికి ఉన్న ప్రాధాన్యం తెలుస్తుంది. మీరు అనుకునే కిస్సింగ్ సీన్ కాదు. కొన్ని సెకన్లు మాత్రమే ఉంటుంది. ట్రైలర్‌లో కనిపించడంతో అది వైరల్ అయింది. ఈ సీన్‌కు అంత ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం లేదు. ఇతర నటీనటులు ముద్దు సన్నివేశాల్లో నటించడం లేదా? ఒక అగ్రనటుడు నటిస్తే అంత ప్రాముఖ్యత ఇస్తారా? ముద్దు పెట్టుకోవడం అనేది ఇపుడు సర్వసాధారణం. కాగా, 21 యేళ్ళ తర్వాత అంటే 'విరుమాండి' తర్వాత కమల్‌తో అభిరామి ముద్దు సన్నివేశంలో నటించడం గమనార్హం.


కమల్ హాసన్ - అభిరామి

## కున్నూరులో ఎలుగుబంటి సంచారం


కున్నూరు వద్ద సంచరిస్తున్న ఎలుగుబంటి

చెన్నై, మే 31 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లా కున్నూరు సమీపం మౌంట్ ప్లెసెంట్ రెసిడెన్షియల్ నివాస గృహాల నడుమ శనివారం ఉదయం ఎలుగుబంటి సంచరించడంతో స్థానికులు భయాందోళనలకు గురయ్యారు. అడవి నుంచి బయటపడి ఆహారం కోసం వెదుక్కుంటూ వేగంగా నడిచి వస్తున్న ఎలుగుబంటిని వాకింగ్‌కు వెళ్లి వస్తున్న స్థానికులు గమనించి నలువైపులా పరుగులు తీశారు. ఆ తర్వాత స్థానికులు అటవీ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. అటవీ శాఖ అధికారులు హుటాహుటిన అక్కడికి చేరుకుని ఆ ఎలుగుబంటిని అటవీ ప్రాంతంలోకి తరిమేశారు.

## తిరునాగేశ్వరంలో వైకాశి విశాఖ ఉత్సవాల ప్రారంభం


తిరునాగేశ్వరాలయ ధ్వజస్తంభం

చెన్నై, మే 31 (ఆంధ్ర జ్యోతి): తంజావూరు జిల్లాలో నవగ్రహ క్షేత్రాల్లో రాహుదోష పరిహార క్షేత్రంగా భాసిల్లుతున్న తిరునాగేశ్వరం నాగనాథ స్వామివారి ఆలయంలో వైకాశి విశాఖ ఉత్సవాలు శనివారం ఉదయం ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలు 12 రోజులపాటు జరగనున్నాయి. శనివారం ఉదయం ధ్వజారోహణానికి ముందుగా వినాయకుడు, వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి, ఉత్సవమూర్తి నాగనాథస్వామి, గురికుజాంబిగై, చండికేశ్వరర్ పంచమూర్తులు అస్త్రదేవతల సమేతంగా ధ్వజస్తంభ మంటపం వద్ద వేంచేశారు. ఆ తర్వాత మంగళవాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్చాటనల నడుమ ఆలయ ప్రధానార్చకులు ధ్వజారోహణం నిర్వహించారు. ఈ వేడుకల్లో వేలాదిమంది భక్తులు పాల్గొన్నారు.

## ఊటీలో తగ్గిన వర్షాలు

- మళ్లీ పర్యాటకుల సందడి


ఊటీలో బోట్ సవారీ చేస్తున్న పర్యాటకులు

చెన్నై, మే 31 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లాల్లో ప్రత్యేకించి ప్రముఖ పర్యాటక ప్రాంతం ఊటీలో నైరుతి రుతుపవనాల ఆగమనం, బంగాళాఖాతంలో అల్పవాయుపీడం వంటి కారణాల వల్ల గత వారం రోజులుగా కురిసిన భారీ వర్షాలకు జనజీవనం స్తంభించింది. శుక్రవారం మధ్యాహ్నం నుంచి ఊటీలో వర్షాలు తగ్గుముఖం పట్టాయి. దీంతో గత నాలుగు రోజులుగా మూసివేసిన ఉద్యానవనాలను అధికారులు తెరిచారు. ఆ మేరకు బొటానికల్ గార్డెన్, రోస్ గార్డెన్, పైక్రా, ఊటీ బోట్‌హౌస్‌లు తదితర పర్యాటక ప్రాంతాలను పునఃప్రారంభించారు. దీంతో సెలవు దినమైన శనివారం ఉదయం నుంచే పర్యాటకుల రాక క్రమంగా పెరుగుతూ వచ్చింది. ఆరు రోజుల తర్వాత బోట్‌హౌస్‌లో పడవల సవారీ ప్రారంభమైంది. పర్యాటకులు చాలా మంది చల్లటి వాతావరణంలో సవారీ చేయడానికి బోట్‌హౌస్ వద్ద బారులు తీరారు.

## 'ఆపరేషన్ సిందూర్' కీర్తి చాటేలా ఎన్‌సీసీ విద్యార్థుల యోగా ప్రదర్శన


యోగా ప్రదర్శనలో విద్యార్థులు

చెన్నై, మే 31 (ఆంధ్రజ్యోతి): 'ఆపరేషన్ సిందూర్' కీర్తిప్రతిష్టలు చాటేలా కుంభకోణంలో ఒకే ప్రాంతంలో 500 మందికి పైగా ఎన్‌సీసీ క్యాడెట్లు యోగా ప్రదర్శనలో పాల్గొన్నారు. ఒకే ప్రాంతంలో 500 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్న కార్యక్రమం ఇదే కావడం గమనార్హం. తంజావూరు జిల్లా కుంభకోణం మహామహం కొలను సమీపంలో శనివారం ఈ ప్రదర్శన జరిగింది. ఈ ప్రదర్శనలో తంజావూరు, తిరువారూరు, నాగపట్టినం, మైలాడుదురై, అరియలూరు తదితర జిల్లాలకు చెందిన ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొని, మూడు రకాల యోగాసనాలు వేశారు.

## ప్రపంచ తెలుగు సమాఖ్య ఆధ్వర్యంలో 7 నుంచి తెలుగు తరగతులు

చెన్నై, మే 31 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ తెలుగు సమాఖ్య ఆధ్వర్యంలో జూన్ 7వ తేదీ నుంచి ఉచిత తెలుగు భాషా తరగతులు జరగనున్నాయి. సమాఖ్య ఆధ్వర్యంలో మూడు దశాబ్దాలుగా ఉచిత తెలుగు భాషా తరగతులు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటి వరకూ 7 వేల మందికి పైగా ఇలా తెలుగు నేర్చుకున్నారు. ఇందులో ఇతర భాషల వారు కూడా గణనీయంగా ఉండడం విశేషం. 4 నుంచి 6 నెలల పాటు జరిగే ఈ తరగతుల్లో తెలుగు చదవడం, రాయడం నేర్పుతున్నారు. ప్రతి బ్యాచ్‌కు సర్టిఫికెట్లు కూడా పంపిణీ చేస్తున్నారు. ప్రతి ఏటా జూన్, నవంబర్‌లో తెలుగు శిక్షణ తరగతులు ప్రారంభమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ ఏడాదికి గాను జూన్ 7వ తేదీ నుంచి తెలుగు తరగతులు ప్రారంభం కానున్నాయి. మరిన్ని వివరాలకు నెం.9841616465, 7305557322 లలో సంప్రదించవచ్చని సంస్థ ప్రతినిధి గోటేటి వెంకటేశ్వర రావు పేర్కొన్నారు.



ప్రపంచ పొగాకు రహిత దినాన్ని పురస్కరించుకుని శనివారం పోరూర్‌లో అవగాహనా ర్యాలీ నిర్వహిస్తున్న శ్రీరామచంద్రా మెడికల్ యూనివర్శిటీ సిబ్బంది

విమానాశ్రయ విస్తరణ పనులు..

## 4వ టెర్మినల్ నుంచి బుల్లి విమానాలు

చెన్నై, మే 31 (ఆంధ్రజ్యోతి): చెన్నై జాతీయ విమానాశ్రయ విస్తరణ పనుల్లో భాగంగా ఇండిగో సంస్థ నడుపుతున్న చిన్న విమానాలను ఈనెల 1న ఆదివారం నుంచి నాల్గో టెర్మినల్ నుండి నడపనున్నట్లు అధికారులు ప్రకటించారు. ఈ విమానాశ్రయంలో మొదటి టెర్మినల్ నుంచి బయలుదేరాల్సిన ఇండిగో ఎయిర్‌లైన్స్ సంస్థ ఏటీఆర్ విమానాలన్నీ నాల్గో టెర్మినల్ నుంచి బయలుదేరుతాయన్నారు. ఆదివారం వేకువజాము నుంచి ఈ మార్పులు అమలవుతాయన్నారు. చెన్నై విమానాశ్రయం నుంచి ఇండిగో ఎయిర్‌లైన్స్ సంస్థ మదురై, తిరుచ్చి, తూత్తుకుడి, సేలం, మైసూరు, మంగళూరు, కోళికోడ్, విజయవాడ, రాజమండ్రి నగరాలకు ఉదయం నుంచి రాత్రి వరకు 36 విమానాలను నడుపుతోంది. ఇండిగో ఎయిర్‌లైన్స్ ఏటీఆర్ రకానికి చెందిన తొలి విమానం చెన్నై నుంచి కోళికోడ్‌కు వేకువజాము 5.10కు బయలుదేరుతుంది. అదే ఆ సంస్థ ఏటీఆర్ రకం చివరి విమానం రాత్రి 9.05 గంటలకు చెన్నై నుంచి తిరుచ్చికి బయలుదేరుతుందని పేర్కొన్నారు. ఇండిగో సంస్థ ఢిల్లీ, ముంబాయి, కొల్‌కత్తా, హైదరాబాద్, తిరువనంతపురం, కొచ్చిన్, బెంగళూరు, కోయంబత్తూరు నగరాలకు వెళ్లే పెద్ద విమానాలు ఎప్పటిలాగే టెర్మినల్ 1 నుంచి బయలుదేరుతాయని అధికారులు వివరించారు.

## యువకుల్లో ప్రతిభను వెలికితీసేలా ఎస్‌ఎస్‌ఎల్‌పీ

- చైర్మన్ ఆసిఫ్ అలీ వెల్లడి



ఎస్ఎస్‌పీఎల్ ప్రారంభంలో పాల్గొన్న రవి మోహన్, టోర్నీ నిర్వాహకులు

అడయార్, మే 31 (ఆంధ్రజ్యోతి): అట్టడుగు స్థాయిలోని యువకుల్లో ప్రతిభను వెలికితీసేలా సదరన్ స్ట్రీట్ ప్రీమియర్ లీగ్ (ఎస్ఎస్ఎల్‌పీ) టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నీ ప్రారంభం, లోగో ఆవిష్కరణ శనివారం జరిగింది. ఈ ప్రారంభోత్సవాల్లో సినీ సెలెబ్రిటీ, హీరో రవి మోహన్, ఎస్ఎస్ఎల్‌పీ చైర్మన్ మొహ్మద్ ఆసిఫ్ అలీ, ఎస్ఎస్ఎల్‌పీ డైరెక్టర్, సీఈవో ఆనంద్, పలువురు వ్యాపారవేత్తలు, ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మొహ్మద్ ఆసిఫ్ అలీ మాట్లాడుతూ, ఈ టోర్నీని తమిళనాడు, కేరళ, కర్నాటక, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, పుదుచ్చేరి, గోవా రాష్ట్రాల్లో అట్టడుగు స్థాయిలో ఉన్న ప్రతిభను వెలికి తీసేలా నిర్వహిస్తామన్నారు. వివిధ రకాలైన పోటీల తర్వాత మెరికల్లాంటి ఆటగాళ్లలో 12 పవర్ హౌస్ జట్లను తయారు చేస్తామన్నారు. ఈ టోర్నీ ఆగస్టు 15వ తేదీ నుంచి ప్రారంభమవుతుందని అన్ని మ్యాచ్‌లను చెన్నైలో, ఫైనల్ మాత్రం షార్జా వేదికగా నిర్వహిస్తామన్నారు. టోర్నీ మొత్తం నగదు బహుమతి రూ.3 కోట్లు అని చెప్పారు. ఆటగాళ్ల ఎంపిక కోసం వేలం నిర్వహిస్తామని, కనీస ధర రూ.1.50 లక్షలుకాగా, గరిష్ఠంగా ధర రూ.3 లక్షలని వివరించారు. దేశంలో ప్రతి బాలుడి జీవితంలో క్రికెట్ అంతర్భాగమన్నారు. అందుకే వీధుల్లోనే టెన్నిస్ బాల్ (గల్లీ క్రికెట్)తో క్రికెట్ ఆడుతుంటారన్నారు. ఇలాంటి వారిలో ఎంతో ప్రతిభ దాగివుంటుందన్నారు. అలాంటి వారిని గుర్తించి దేశానికి అందించడమే ఈ టోర్నీ ముఖ్యోద్దేశమన్నారు. హీరో రవి మోహన్ మాట్లాడుతూ... తనకు గల్లీ క్రికెట్ ఆడిన అనుభవం ఉందన్నారు. ఈ తరహా టోర్నీల నిర్వహణ ద్వారా ప్రతిభ కలిగిన యంగ్ టాలెంట్ యువకులను గుర్తించి మెరికల్లాగా తయారు చేస్తామని పేర్కొన్నారు.

## అమ్మవారికి బంగారు కాసులమాల


డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్‌కు బంగారు కాసుల మాల అందజేస్తున్న దాత కుమార్

పద్మావతి అమ్మవారికి శనివారం బెంగళూరుకు చెందిన కుమార్ 110 గ్రాముల బంగారు కాసుల మాలను కానుకగా అందజేశారు. దీనిని డిప్యూటీ ఈవో హరీందర్ నాథ్ స్వీకరించారు. దాతకు దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదపండితులు ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. సూపరింటెండెంట్ రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, చలపతి, సుభాస్కర్‌నాయుడు, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి


- సంగీత, నృత్య, నాదస్వరం కోర్సుల్లో చేరికకు

## దరఖాస్తుల ఆహ్వానం

ఎస్వీ సంగీత, నృత్య కళాశాల, నాదస్వరం, డోలు పాఠశాలలో 2025-26విద్యా సంవత్సరానికి పలు కోర్సుల ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు టీటీడీ శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. గాత్రం, వీణ, వేణువు, వయొలిన్, నాదస్వరం, డోలు, భరతనాట్యం, కూచిపూడి, నృత్యం, హరికథ, మృదంగం, ఘటం విభాగాల్లో ఫుల్ టైమ్, విశారద(డిప్లొమా), ప్రవీణ(అడ్వాన్సు డిప్లొమా) కోర్సులున్నాయని పేర్కొంది. నాదస్వరం, డోలు పాఠశాలలో ఫుల్‌టైమ్ సర్టిఫికెట్, డిప్లొమా కోర్సులున్నాయని, ఈనెల 27వ తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయని వెల్లడించింది. ఇతర ప్రాంతాల విద్యార్థులకు హాస్టల్ వసతి ఉంటుందని వివరించింది. ఆసక్తిగల అభ్యర్థులు కళాశాల కార్యాలయ పనివేళల్లో ఈవో, టీటీడీ పేరుతో రూ.50డీడీ తీసి దరఖాస్తు పొందాలని, రెగ్యులర్ కోర్సులకు 8వ తరగతి ఉత్తీర్ణత, సాయంత్రం కోర్సులకు 5వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని తెలిపింది. మరిన్ని వివరాలకు 9440793205, 9848374408లను సంప్రదించాలని కోరింది.

- తిరుపతి అర్బన్, ఆంధ్రజ్యోతి

## సర్వదర్శనానికి 16 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 16 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 31 కంపార్టుమెంట్లలో, నారాయణగిరి ప్యార్క్‌లో 9 షెడ్లలో సర్వదర్శన భక్తులు నిండిపోయారు. క్యూలైన్ శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

**గురువారం హుండీ ఆదాయం: రూ.3.42 కోట్లు**

**శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 71,721**

**తలనీలాలు సమర్పించినవారు: 36,011**



# నేటి నుంచి షాపుల్లోనే రేషన్

- దివ్యాంగులు, వృద్ధులకు ఇళ్ల వద్దకే
- పంపిణీకి ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు


తిరుపతిలోని రేషన్ దుకాణంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న సివిల్ సప్లయిస్ డీటీ సురేంద్ర

ఎండీయూ వాహనం వచ్చే రోజుకోసం పని మానుకుని ఎదురు చూడాల్సిన పనిలేదు. పట్టణాల్లో వీధి చివరన.. రోడ్డు పక్కన క్యూలో నిలబడి రేషన్ తీసుకోవాల్సిన అవసరం ఉండదు. ఇక నుంచి తొలి 15 రోజుల్లో.. మనకు వీలున్నప్పుడు వెళ్లి సరుకులు తీసుకోవచ్చు. జూన్ నుంచి పాత పద్ధతిలో రేషన్ పంపిణీకి ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

- తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి

జిల్లాలోని 1457 చౌక ధరల దుకాణాల్లో పాత పద్ధతిలోనే ఆదివారం నుంచి కార్డుదారులకు సరుకులు అందించనున్నారు. ఈ మేరకు పౌరసరఫరాలు, తూనికలు, కొలతలు, రెవెన్యూ శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేస్తున్నారు. మండల స్థాయి నిల్వ కేంద్రాల నుంచి జూన్ నెల కోటాను సంబంధించిన బియ్యం, చక్కెర, కంది పప్పు నిల్వలను రేషన్ దుకాణాలకు తరలించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎండీయూ వాహనాల వ్యవస్థను రద్దు చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో రేషన్ షాపుల్లో డీలర్లు ఈ-పోస్, తూకం మిషన్లు సిద్ధం చేసుకున్నారు. ధరల పట్టిక, నిల్వ వివరాలు, రేషన్ షాపు నెంబరు ప్రదర్శించాలని ఇప్పటికే డీఎస్‌వో శేషాచలం రాజు డీలర్లకు ఆదేశాలు జారీ చేశారు. దుకాణాలు శుభ్రంగా ఉంచుకోవాలని, జూన్ 1న పూలతో అలంకరించాలని ప్రజాప్రతినిధులను, వృద్ధులను ప్రారంభ కార్యక్రమానికి ఆహ్వానించాలని అధికారులు పేర్కొన్నారు. ఇక, రేషాపుల్లో ఏర్పాట్లపై అధికారులు తనిఖీ చేస్తున్నారు. తూకం మిషన్లు పనిచేయని చోట తక్షణం కొత్తవి కొనుగోలు చేసి ఏర్పాటు చేయాలన్నారు. ఇక తాగు నీరు, కూర్చోవడానికి బెంచీలు లేదా కుర్చీలు ఏర్పాటు చేయనున్నారు. అవసరమైతే ప్రతి రేషన్ షాపులో రెండు ఫ్యాన్ల ఏర్పాటుకు అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

**వీళ్లకు.. ఇళ్ల వద్దకు**

65 ఏళ్లు దాటిన వృద్ధులు, దివ్యాంగులకు ఇంటికి తీసుకెళ్లి సరుకులు ఇవ్వనున్నారు. వీరందరినీ వాట్సాప్ గ్రూపుగా ఏర్పాటు చేసి సమాచారం ఇవ్వాలి. వీరికి 5వ తేది వరకు మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఇంటి వద్దకు సరుకులు అందించేలా ఏర్పాట్లు చేయాలి.

**రేషన్ షాపుల పనివేళలు**

ప్రతి నెలా 1 నుంచి 15వ తేది వరకు సరుకులు ఇవ్వాలి. ఈ రోజుల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 వరకు.. సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు రేషన్ షాపులు తెరచి ఉంచాలి. ఏ చౌక ధర దుకాణం నుంచైనా వారికి అవసరమైన సరుకులు పొందవచ్చును.



అలిపిరి చెక్‌పాయింట్‌లో కార్ల బారులు.. క్యూలో భక్తులతో మాట్లాడుతున్న అదనపు ఈవో వెంకయ్య

- కొండపై సమ్మర్ ఎఫెక్ట్

# కిటకిటలాడుతున్న తిరుమల

తిరుమల, మే 31 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. వేసవి సెలువులు చివరిదశలో ఉండటంతో పాటు వారాంతం కావడంతో శుక్రవారం ఉదయం నుంచే తిరుమలకు వచ్చే భక్తుల సంఖ్య పెరిగింది. ఈక్రమంలో తిరుమల క్షేత్రం భక్తులతో కిటకిటలాడుతోంది. వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరి పార్క్‌లోని 9 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయాయి. శుక్రవారం తరహాలోనే శనివారం కూడా క్యూలైన్ కృష్ణతేజ విశ్రాంతి భవనం మీదుగా రింగురోడ్డులో శిలాతోరణం సర్కిల్ వరకు సర్వదర్శన భక్తుల క్యూ వ్యాపించింది. వీరికి దాదాపు 16 గంటల తర్వాత దర్శనం లభిస్తోంది. టైంస్లాట్ టోకెన్లు, టికెట్లు ఉన్న భక్తులకూ 3 గంటల దర్శన సమయం పడుతోంది. పెరిగిన రద్దీ నేపథ్యంలో శ్రీవారి ఆలయం, మాడవీధులు, అన్నప్రసాదకేంద్రం, వరాహస్వామి విశ్రాంతి గృహాల సర్కిల్, రాంభగీచా, లేపాక్షి కూడళ్లు, బస్టాండ్, యాత్రికుల వసతి సముదాయాలు, కల్యాణకట్టలు, లడ్డూకేంద్రం, ఎంబీసీ, ఎస్వీ గెస్ట్‌హౌస్ వంటి ప్రాంతాల్లో యాత్రికులు కిక్కిరిసిపోయారు.


జేఈవో ఆఫీసు నుంచి నారాయణగిరి గెస్ట్‌హౌస్ దారిలో..

**బారులు తీరుతున్న కార్లు**

కొవిడ్ తర్వాత తిరుమలకు పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు కంటే సొంతవాహనాల్లో ఎక్కువ మంది భక్తులు వస్తున్నారు. దీంతో తిరుమలలో కార్లు కిక్కిరిసిపోతున్నాయి. శనివారం కూడా అలిపిరి చెక్‌పాయింట్ వాహనాలతో రద్దీగా మారింది. గరుడసర్కిల్ ఆర్చ్ వరకు వాహనాలు నిలిచిపోయాయి. దీంతో వీఐపీ, సర్వీసు లైన్లతో పాటు ద్విచక్రవాహనాలను అనుమతించే మార్గంలోనూ కార్లను అనుమతించారు. ఇక, తిరుమలలోనూ పార్కింగ్ ప్రాంతాలు నిండిపోవడంతో రోడ్లపైనే భక్తులు వాహనాలను పెట్టి దర్శనానికి వెళ్లిపోతున్నారు. దీంతో తిరుమలలో ట్రాఫిక్ సమస్య నెలకొంది.


అన్నదానం కాంప్లెక్స్ వద్ద భక్తుల రద్దీ

ఉమ్మడి జిల్లా పాలిటెక్నిక్‌ల నుంచి

# 29 పోస్టులు ఔట్

- ఇతర జిల్లాలకు 8 బోధన.. 21 బోధనేతర సిబ్బంది బదిలీ
- బయటి నుంచి 5 పోస్టుల రాక
- జిల్లాలోనే ఏడు సర్దుబాటు

తిరుపతి, మే 31 (ఆంధ్రజ్యోతి): తిరుపతి, చిత్తూరు జిల్లాలకు చెందిన ప్రభుత్వ పాలిటెక్నిక్‌లు 8 టీచింగ్, 21 నాన్ టీచింగ్ పోస్టులు కోల్పోయాయి. ఈ 29 పోస్టులను ప్రభుత్వం ఇతర జిల్లాలకు బదిలీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 2008లో పాక్షిక పోస్టులతో మంజూరైన.. 2014-15లో పోస్టులే లేకుండా ఏర్పాటైన పాలిటెక్నిక్‌లలో టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులు సరిపడా లేక నిర్వహణ కష్టంగా మారింది. దీన్ని దృష్టిలో ఉంచుకుని పాత పాలిటెక్నిక్‌ల నుంచీ కొన్ని పోస్టులను అవసరమైన చోట్లకు ప్రభుత్వం బదిలీ చేసింది. అందులో భాగంగా టీచింగ్ పోస్టులలో.. తిరుపతి ఎస్వీ పాలిటెక్నిక్ నుంచీ తాడిపత్రికి.. పుత్తూరు మండలం పిళ్లారిపట్టు పాలిటెక్నిక్ నుంచీ నెల్లూరుకు, కడప జిల్లా సింహాద్రిపురానికి ఒక్కోటి చొప్పున.. గూడూరు పాలిటెక్నిక్ నుంచి ఈతముక్కల బాలికల పాలిటెక్నిక్‌కు, నెల్లూరు జిల్లా ఆత్మకూరుకు ఒక్కోటి వంతున పోస్టులు బదిలీ అయ్యాయి. పలమనేరు బాలికల పాలిటెక్నిక్ నుంచీ కళ్యాణదుర్గానికి, మదనపల్లె మోడల్ నుంచి కళ్యాణదుర్గానికి, గుంటూరు మైనారిటీ పాలిటెక్నిక్‌కు ఒకటి చొప్పున మూడు పోస్టులు బదిలీ అయ్యాయి. ఇక నాన్ టీచింగ్ పోస్టుల విషయానికొస్తే గూడూరు సిరామిక్ టెక్నాలజీ సంస్థ నుంచీ తొమ్మిది, పలమనేరు బాలికల పాలిటెక్నిక్ నుంచీ ఎనిమిది, మదనపల్లె మోడల్ పాలిటెక్నిక్ నుంచీ మూడు, గూడూరు పాలిటెక్నిక్ నుంచీ ఒకటి చొప్పున మొత్తం 21 నాన్ టీచింగ్ పోస్టులు ఇతర జిల్లాలకు బదిలీ అయ్యాయి.

- నంద్యాల పాలిటెక్నిక్ నుంచీ తిరుపతి ఎస్వీ పాలిటెక్నిక్‌కు ఒకటి, కళ్యాణ దుర్గం నుంచీ పలమనేరు బాలికల పాలిటెక్నిక్‌కు ఒకటి చొప్పున రెండు టీచింగ్ పోస్టులు బదిలీ అయ్యాయి. అలాగే శ్రీశైలం, కర్నూలు, నంద్యాల పాలిటెక్నిక్‌ల నుంచీ ఒక్కోటి చొప్పున మూడు నాన్ టీచింగ్ పోస్టులు సత్యవేడు పాలిటెక్నిక్‌కు వచ్చాయి.
- తిరుపతి, చిత్తూరు జిల్లాల పరిధిలోనే ఒక పాలిటెక్నిక్ నుంచీ మరో పాలిటెక్నిక్‌కు 8 టీచింగ్ పోస్టులను సర్దుబాటు చేశారు. పలమనేరు బాలికల పాలిటెక్నిక్ నుంచీ మూడు, మదనపల్లె మోడల్ పాలిటెక్నిక్, కలికిరి, పిళ్లారిపట్టు, చంద్రగిరి పాలిటెక్నిక్‌ల నుంచీ ఒక్కోటి చొప్పున ఏడు టీచింగ్ పోస్టులు తిరుపతి ఎస్వీ పాలిటెక్నిక్‌కు బదిలీ చేశారు.

## నేడు కానిస్టేబుళ్ల ఎంపిక పరీక్షలు

- నిమిషం ఆలస్యమైనా లోపలకు నో ఎంట్రీ
- అన్ని కేంద్రాల వద్ద 144 సెక్షన్


తిరుపతిలోని పరీక్షా కేంద్రంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న డీఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), మే 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆదివారం కానిస్టేబుళ్ల ఎంపికకు రాత జరగనుంది. ఈ పరీక్షకు 5207 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగే రాత పరీక్షకు నిమిషం ఆలస్యమైన లోపలకి అనుమతి లేదని అదనపు ఎస్పీ, పరీక్షల నోడల్ అధికారి రవిమనోహరాచ్చారి ప్రకటించారు. అభ్యర్థులందరూ గంటన్నర ముందుగా కేంద్రం వద్దకు చేరుకోవాలని సూచించారు. అక్కడ బయోమెట్రిక్ వద్ద వేలి ముద్ర వేసి లోపలికి వెళ్ళి ఆయా కేంద్రాల వద్ద పరీక్షలు రాయాలన్నారు. తిరుపతిలో ఏడు, రేణిగుంటలో ఒకటి, తిరుచానూరులో ఒకటి వంతున కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రతి కేంద్రం వద్ద సీఐ, ఎస్‌ఐలు, నలుగురు కానిస్టేబుళ్ళు ఇద్దరు మహిళా కానిస్టేబుళ్ళను, ఒక స్పెషల్ బ్రాంచ్ కానిస్టేబుల్‌ను నియమించారు. డీఎస్పీ భక్తవత్సలం నేతృత్వంలో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రానికి 100 మీటర్ల లోపు వరకు ఎలాంటి జిరాక్స్ సెంటర్లు, బుక్ షాపులు, ఇతర దుకాణాలు తెరచి వుండకూడదని పోలీసులు విజ్ఞప్తి చేశారు. 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. ఒక పెన్, పరీక్ష ప్యాడ్ మాత్రమే తీసుకెళ్లొచ్చన్నారు. తిరుపతిలోని పరీక్షా కేంద్రాలను శనివారం డీఎస్పీ భక్తవత్సలం, ఈస్ట్ సీఐ శ్రీనివాసులు, ఎస్‌ఐలు పరిశీలించారు.

**జిల్లా వ్యాప్తంగా 30 పోలీసు యాక్ట్**

పోలీసు కానిస్టేబుల్ రాత పరీక్షల నేపథ్యంలో జిల్లాలో సెక్షన్ 30 పోలీసు యాక్ట్ అమల్లో ఉంటుందని ఎస్పీ హర్షవర్ధనరాజు ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం నుంచి వచ్చేనెల 30వ తేది వరకు అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. పోలీసు అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ఊరేగింపులు, నిరసన, ధర్నా కార్యక్రమాల నిర్వహించరాదని తెలిపారు.

# ఏక్ నిరంజన్.. శ్యాంప్సన్

- 20 ఏళ్లక్రితం నైజీరియా నుంచి తిరుపతికి
- ఎస్వీయూలో డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ పూర్తి
- అనారోగ్యంతో మృతి చెంది అనాథగా అంత్యక్రియలు

తిరుపతి- ఆంధ్రజ్యోతి

నైజీరియాకు చెందిన ఎస్వీయూ పరిశోధక విద్యార్థి శ్యాంప్సన్ ఓకాన్ (65)నెల రోజుల క్రితం అనారోగ్యంతో మృతిచెందారు. వారి కుటుంబీకులు ఎవరూ రాకపోవడంతో కలెక్టర్ ఆదేశాలతో శనివారం సాయంత్రం జీవకోనలోని శ్మశానవాటికలో క్రైస్తవ మత ఆచారంతో పోలీసులు అంత్యక్రియలు పూర్తి చేశారు.

**ఎవరీ శ్యాంప్సన్**

నైజీరియా దేశాన్ని ఎందుకు విడిచిపెట్టారో తెలియదు. ఇరవై ఏళ్ల క్రితమే ఇండియాకి వచ్చారు. తిరుపతికి చేరుకుని సుమారు తన 45 ఏళ్ల వయస్సులో ఎస్జీఎస్ కాలేజీలో డిగ్రీలో చేరారు. డిగ్రీ పూర్తయిన తర్వాత (2003-06) ఎస్వీ యూనివర్సిటీ స్టాటిస్టిక్స్ విభాగంలో పీజీలో చేరారు. 2006-08 పీజీ తర్వాత రెండేళ్ల విరామం అనంతరం ప్రొఫెసర్ సుబ్బరామిరెడ్డి పర్యవేక్షణలో (2010) పీహెచ్‌డీ చేరి 2019లో డాక్టరేట్ పొందారు. డిగ్రీ, పీజీ చదువుకునే సమయంలో వెస్ట్ చర్చి వద్ద ఎస్ఏఎల్సీ ఆధ్వర్యంలో ఉండే క్రిస్టియన్ హాస్టల్ (ప్రస్తుత కలెక్టర్ నివాసం పక్కన)లో ఉండేవారు. 2017లో ఎల్బీనగర్‌లోని ఓ చర్చిలో రేకుల గదిలో అద్దెకు చేరారు. ఏప్రిల్ 27న సాయంత్రం 6 గంటల సమయంలో ఇంటి యజమాని టీపీ మధుకుమార్ చూస్తే అస్వస్థతతో కనిపించారు. 108కు సమాచారమిచ్చి రుయాస్పత్రిలో చేర్పించగా.. అక్కడ చికిత్సపొందుతూ రాత్రి 11 గంటల ప్రాంతంలో మృతిచెందారు.


శ్యాంప్సన్ మృతదేహం

**35 రోజులగా మార్చురీలో..**

ఇంటి యజమాని మధు కుమార్ ఫిర్యాదు మేరకు యూనివర్సిటీ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల విచారణలో శ్యాంప్సన్ వీసా (పాస్‌పోర్ట్ నెంబరు -ఏటి312988) గడువు ముగిసినట్టు గుర్తించారు. ఆయన మృతిచెందినట్లు న్యూఢిల్లీలోని నైజీరియా హైకమిషన్‌కు సమాచారమిచ్చారు. మృతదేహాన్ని తీసుకెళ్లేందుకు ఎవరూ సుముఖత చూపలేదు. నెలరోజులకు పైగా మార్చురీలో ఉన్న మృతదేహం డీకంపోజ్ అవుతోందని, వెంటనే తీసుకెళ్లాలని ఎస్వీ మెడికల్ కాలేజ్ ఫోరెన్సిక్ వైద్యులు పోలీసులకు సూచించారు. దీంతో కలెక్టర్ ఆదేశాలతో తిరుపతిలోనే అంత్యక్రియలు నిర్వహించాలని నిర్ణయించారు. విదేశీ మంత్రిత్వ శాఖ మార్గదర్శకాల మేరకు క్రిస్టియన్ సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలకు ఏర్పాట్లు చేయాలని కమిషనర్ మౌర్యకు కలెక్టర్ సూచించారు. శనివారం పోలీసులు కార్పొరేషన్ కార్యాలయానికి చేరుకుని శ్యాంప్సన్ మృతికి సంబంధించిన డాక్యుమెంట్లను అందజేశారు. శనివారం నగరపాలక సంస్థ పరిధిలోని జీవకోన సంజయ్‌గాంధీ కాలనీ స్మశాన వాటికలో అంత్యక్రియలు పూర్తి చేశారు.

## 5న ఐదు లక్షల మొక్కలు నాటాలి


సమీక్షిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), మే 31(ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 5వ తేదీన జిల్లావ్యాప్తంగా 5లక్షల మొక్కలు నాటాలని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో అటవీ, డ్వామా, గ్రామ పంచాయతీ శాఖ అధికారులతో ఆయన జూమ్ మీటింగ్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మిషన్ హరితాంధ్రప్రదేశ్ వనం మనం కార్యక్రమంలో భాగంగా ఈ మేరకు మండలాలు, మున్సిపాలిటీల్లో ఏర్పాట్లు చేపట్టాలన్నారు. లక్ష్యానికి అనుగుణంగా అటవీ శాఖ అధికారులు మొక్కలు నాటేలా చూడాలన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా ప్రభుత్వ భూములు, రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటడానికి చర్యలు చేపట్టాలన్నారు. చంద్రగిరి నియోజకవర్గం చిన్నగొట్టిగల్లు, ఎర్రవారిపాళెం మండలాల్లో ఏనుగుల సంచారం ఎక్కువగా ఉంటోందని, అక్కడ నిమ్మ తోటలు పెంచేలా చూసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అటవీశాఖ అధికారి వివేక్, డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్, డీపీవో సుశీలాదేవి పాల్గొన్నారు.

**విపత్తు నిర్వహణపై ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి**

విపత్తు నిర్వహణపై ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో కలెక్టర్లతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ శనివారం టెలీ కాన్ఫరెన్సు నిర్వహించి, దిశానిర్దేశం చేశారు. అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ ఈ ఏడాది అధికంగా వర్షాలు పడే అవకాశమున్న నేపథ్యంలో పంట కాల్వలు, చెరువు కట్టలు, చెక్‌డ్యామ్‌లను బలోపేతానికి చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణ ప్రాంతాల్లో డ్రైనేజీల్లో మురుగు, చెత్త తొలగించాలని సూచించారు. వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు.

## రూ.21.27 కోట్లతో 303 ఇరిగేషన్ పనులు

- అనుమతిచ్చిన ప్రభుత్వం

తిరుపతి, మే 31 (ఆంధ్రజ్యోతి): తిరుపతి తెలుగు గంగ ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ పరిధిలో రూ.21.27 కోట్లతో 303 ఇరిగేషన్ పనులు చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా సాగునీటి సంఘాలు లేని చోట్ల, రూ.10 లక్షల అంచనా వ్యయం పైబడిన పనులకు షార్ట్ టెండర్లు పిలిచేందుకు అనుమతించాలని ఇరిగేషన్ శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. మైనర్, మీడియం, మేజర్ ఇరిగేషన్ ప్రాజెక్టుల పరిధిలో నిర్వహణ కింద రూ.344.39 కోట్లతో 7174 పనులు చేపట్టేందుకు సంబంధిత అనుమతులు అవసరమని కోరారు. ఇందులో తిరుపతి తెలుగుగంగ చీఫ్ ఇంజనీర్ పరిధిలో రూ.21.27 కోట్లతో 303 పనులు ప్రతిపాదించారు. షార్ట్ టెండర్ నోటీసులు జారీ చేసి ఈ పనులు చేపట్టేందుకు అనుమతినిస్తూ రాష్ట్ర జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శి అనంతరాము శనివారం ఉత్తర్వులు ఇచ్చారు.

### తిరుమల ఎక్స్‌ప్రెస్ రైలు
## గుంతకల్లు వరకు పొడిగింపు

ఎర్రగుంట్ల/కొండాపురం, మే 31 (ఆంధ్రజ్యోతి): కడప-విశాఖపట్నం మధ్య నడిచే తిరుమల ఎక్స్‌ప్రెస్ రైలు (ట్రైన్ నెంబరు18521/18522)ను సోమవారం నుంచి గుంతకల్లు వరకు పొడిగించినట్లు ఎర్రగుంట్ల రైల్వేస్టేషన్ సూపరింటెండెంట్ మోహన్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు కడప నుంచి గుంతకల్లు వరకు ఈ ట్రైన్‌ను స్పెషల్ ట్రైన్ (నెంబర్ 07521 /07522)గా ట్రీట్ చేస్తూ రైల్వేశాఖ ఉత్తర్వులు జారీచేసింది. విశాఖపట్నం నుంచి కడపకు ఉదయం 7.45 గంటలకు చేరుకుని ఎర్రగుంట్ల, కొండాపురం, తాడిపత్రి, గుత్తి మీదుగా గుంతకల్లుకు ఉదయం 11.15కు చేరుతుంది. తిరిగి గుంతకల్లులో మధ్యాహ్నం 1.30కి బయలుదేరి కడపకు సాయంత్రం 5.15కు చేరుకుంటుంది. అక్కడి నుంచి విశాఖపట్నం వెళుతుంది.

# జల్సాల కోసం చోరీలు

- నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), మే 31 (ఆంధ్రజ్యోతి): చెడు అలవాట్లు, విలాసజీవితం కోసం అప్పులపాలయ్యాడు. ఆపై సులభ సంపాదనకు దొంగతనం వైపు అడుగేసిన అతడిని తిరుపతి క్రైం పోలీసులు అరెస్టు చేశారు. క్రైం జిల్లా అదనపు ఎస్పీ నాగభూషణరావు తెలిపిన మేరకు.. చిన్నగొట్టిగల్లు మండలం వంకమద్దివారిపల్లికి చెందిన తమటం భానుచంద్రాచ్చారి చిన్నప్పుడే చెడు అలవాట్లకు లోనయ్యాడు. చుట్టు పక్కల వారిని చూసి తానూ విలాస జీవితం గడపాలని అప్పులుచేసి ఇల్లు కట్టాడు. చివరకు అప్పులు తీర్చలేక.. సులభంగా డబ్బు సంపాదించాలనే దురాలోచనతో దొంగతనాలకు అలవాటు పడ్డాడు. తిరుపతి నగరం ఎంఆర్‌పల్లె, చెర్లోపల్లె, శ్రీకృష్ణనగర్ తదితర ప్రాంతాల్లో తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేశాడు. ఇళ్లు, దుకాణాల్లో దొంగిలించిన బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు, గ్యాస్ సిలిండర్లు, టీవీలను విక్రయించేవాడు. ఆ డబ్బుతో కొంత అప్పులు తీర్చి మిగతా జల్సాలకు ఖర్చు చేసేవాడు. ఇతనిపై చిత్తూరు, నెల్లూరు జిల్లాల్లోనూ పలు దొంగతనం కేసులు ఉన్నట్లు సమాచారం. మే 4న శ్రీకృష్ణనగర్‌లోని పుల్లారెడ్డి కుటుంబం బెంగళూరుకు వెళ్లింది. మళ్లీ మే 16న ఇంటికి వచ్చి చూడగా తలుపులు పగులకొట్టి ఉంది. ఇంట్లోని దాదాపు 21 గ్రాముల బంగారు నగలు, 488 గ్రాముల వెండి వస్తువులు, రెండు టీవీలు, ఇతర వస్తువులు లేవు. క్రైం డీఎస్పీ శ్యాంసుందర్‌కు బాధితుడు ఫిర్యాదు చేశారు. పాత నేరస్తులు ఎవరు? ఏ ప్రాంతానికి చెందిన వారనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేశారు. సీసీ ఫుటేజీల ఆధారంగా నిందితుడి ఆచూకీ గుర్తించారు. వేలి ముద్రలు, ఫొటో ఆధారంగా నిందితుడు చిన్నగొట్టిగల్లు మండలానికి చెందిన వాడని గుర్తించారు. అతడి సెల్‌ఫోన్ నెట్‌వర్కు ఆధారంగా శనివారం రాయలచెరువు రోడ్డులో తచ్చాడుతుండగా క్రైం డీఎస్పీ నేతృత్వంలోని సీఐలు చిన్న పెద్దయ్య, శివకుమార్ రెడ్డి, ప్రకాష్, ఎస్‌ఐ ప్రదీప్‌కుమార్, క్రైం పార్టీ పోలీసులు నిఘా ఉంచి అరెస్టు చేశారు. ఎస్వీయూ పరిధిలో జరిగిన రెండు చోరీలు, క్రైం పరిధిలో జరిగిన ఒక చోరీ కేసుకు సంబంధించి బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు, రెండు టీవీలు, గ్యాస్ సిలిండర్ తదితరాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితున్ని అరెస్టు చేయడంలో ప్రతిభ చూపిన సీఐలతో పాటు ఎస్‌ఐ, ఏఎస్‌ఐ దామోదరం, హెడ్ కానిస్టేబుళ్ళు రవిప్రకాష్, మురళి, మునిరాజ, రమేష్, కానిస్టేబుళ్ళు నాగరాజు, మోహన్, ఈశ్వర్, హరిప్రసాద్‌ను ఎస్పీ అభినందించి నగదు రివార్డులు అందచేశారు.


తిరుపతిలో క్రైం పోలీసులు అరెస్టు చేసిన నిందితుడు